
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
శనివారం 8 మార్చి 2025






బడ్జెట్ ప్రతులను పరిశీలిస్తున్న డీసీఎం డీకే శివకుమార్

వాణిజ్య పన్నుల ద్వారా రూ.1.20 లక్షల కోట్ల లక్ష్యం

2025-26 ఆర్థిక సంవత్సరంలో వాణిజ్యపన్నుల ద్వారా రూ.1.20 లక్షల కోట్లు (58శాతం) ఆదాయం లక్ష్యంగా పెట్టుకున్నారు. మోటారు వాహనాల ద్వారా 15వేల కోట్లు (7శాతం), స్టాంపులు, రిజిస్ట్రేషన్‌లు 28వేల కోట్లు (14శాతం), అబ్కారీ రూ.40వేల కోట్లు (19శాతం), ఇతర పన్నుల ద్వారా 5,100 కోట్లు (2శాతం) లక్ష్యంగా పెట్టుకున్నారు.

విరివిగా వ్యవసాయం..!



● అన్నదాతకు సిద్దూ వరాలు

వ్యవసాయశాఖ ద్వారా పలు కొత్త పథకాలను తీసుకొస్తూ అన్నదాతకు సిద్దరామయ్య వరాలు ప్రకటించారు. 50వేలమంది రైతులకు సాగు యాంత్రీకరణ సమకూర్చేందుకు రూ.428 కోట్లు కేటాయించారు. డ్రిప్ ఇరిగేషన్‌కు 1.8 లక్షల మంది రైతులకు 440 కోట్ల రూపాయలు, కందిసాగులో సాంకేతిక విధానాలకు 88 కోట్లు, 6వేల లఘు ఆహార సంస్కరణా కేంద్రాలను ప్రారంభించేందుకు గ్రీన్‌సిగ్నల్ చూపారు. 12వేల వ్యవసాయ కుంటలతోపాటు డిజిటల్ అగ్రికల్చర్, ఏఐ ఆధారిత సాంకేతికతను పెంపొందింప చేయదలిచారు. మట్టి నమూనాల పరిశీలనలకు 58 అత్యాధునిక ల్యాబ్‌లను తెరువదలిచారు. వరల్డ్ బ్యాంకు సాయంతో భూ వనరుల సమీక్షను జరుపదలిచారు. మండ్యలో వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రారంభానికి అనుమతులు ఇచ్చిన ప్రభుత్వం రూ.25కోట్లు గ్రాంటు కేటాయించింది. సిరిధాన్యాలు, సేంద్రియ ఉత్పత్తుల హబ్ కోసం 20 కోట్ల రూపాయలు కేటాయించారు.

పశువైద్యానికి ప్రాధాన్యం



బడ్జెట్‌లో పశువైద్యానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు. పశుసంవర్ధకశాఖ ద్వారా అన్నదాతలకు అనుకూలంగా ఉండాలనే 50 పశువైద్య కేంద్రాలను ఏర్పాటు చేయదలిచారు. అకస్మికంగా పశువులు మృతి చెందితే ప్రస్తుతం అందిస్తున్న పరిహారాన్ని పెంచనున్నారు. ఎద్దులకు రూ.15వేలు, గొర్రెలు, మేకలకు రూ.7,500, గొర్రెలు, మేక పిల్లలకు రూ.5వేలకు పెంచారు. వంద పశువైద్యకేంద్రాలకు నాబార్డు సాయంత్రం కొత్త భవనాలు నిర్మించదలిచారు. దేశీయ గోజాతి హళ్ళికార్, కిలారి, అమృత్‌మహల్, గొర్రెలలో బండూరు జాతుల సంరక్షణ, అభివృద్ధికి రూ.2కోట్లు కేటాయించారు. మత్స్యశాఖ ద్వారా ఫిషరీస్ కాలేజీకి ప్రస్తుతం కేటాయించిన విద్యార్థులసంఖ్యను పెంచదలిచారు. తీరప్రాంత జిల్లాల్లో మత్స్యకారులకు అనుగుణంగా రోడ్ల నిర్మాణానికి నాబార్డు సాయంతో రూ.30కోట్లు కేటాయించదలిచారు. ఎస్సీ, ఎస్టీలు చేపల విక్రయానికి 4 చక్రాల వాహనాల కొనుగోలుకు 50శాతం రాయితీ లేదా రూ.3లక్షల దాకా ప్రోత్సాహకం ఇవ్వనున్నారు. రిజిస్ట్రేషన్ అయిన చేపలబోట్లు 15 ఏళ్ల ముగిసి ఉంటే కొత్త ఇంజన్ల కొనుగోళ్లకు 50శాతం లేదా లక్ష రూపాయల సాయం చేయనున్నారు. పర్యాటకులకు అనుకూలంగా మైసూరులో హైటెక్ మత్స్యదర్శిని ప్రారంభించదలిచారు. మల్పె ఓడరేవులో మల్పె లెవెల్ పార్కింగ్‌ను పీపీపీ పద్ధతిన చేపట్టదలిచారు.

పథకాలకు.. గ్యారెంటీ..!



బడ్జెట్ ప్రవేశ పెట్టడానికి సభలోకి వెళుతూ.. సీఎం సిద్దరామయ్య ఆత్మవిశ్వాసం.. దరహాసం



- ఐదు గ్యారెంటీలకు రూ.51వేల కోట్ల కేటాయింపు
- అన్నదాతకు సిద్దూ వరాలు.. యాంత్రీకరణకు ప్రోత్సాహకాలు
- పశువులు, గొర్రెల మృతికి పరిహారం పెంపు
- మత్స్యకారులు, కులవృత్తిదారులకు ప్రత్యేక రాయితీలు
- అన్ని వర్గాలనూ మెప్పించేలా రాష్ట్ర బడ్జెట్: ముఖ్యమంత్రి



వీల్‌చైర్‌లో బడ్జెట్ పత్రాలతో..

బెంగళూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలకు రెండేళ్లక్రిందట ఇచ్చిన ఐదు గ్యారెంటీలకు సీఎం సిద్దరామయ్య మరోసారి అభయహస్తం ఇచ్చారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలోనూ ఐదు గ్యారెంటీలకు రూ51వేల కోట్ల రూపాయలు కేటాయించడం ద్వారా ఎప్పుడైనా గ్యారెంటీలు నిలిచిపోతాయనే ప్రతిపక్షాల ఆరోపణలకు ధీటుగా సమాధానమిచ్చారు. ఆర్థికశాఖ మంత్రిగా వ్యవహరిస్తున్న సిద్దరామయ్య శుక్రవారం 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్‌ను శాసనసభలో ప్రవేశపెట్టారు. రూ.4,09,549 కోట్ల బడ్జెట్‌ను సమర్పించారు. 2024-25లో రూ.3,71,383 కోట్ల బడ్జెట్ నుంచి మరింత పెరిగింది. ప్రస్తుత బడ్జెట్‌లో 19,262 కోట్ల రూపాయల రెవెన్యూ లోటును ప్రస్తావించారు. 1994లో జనతాదళ్ పాలనలో ఉపముఖ్యమంత్రిగా తొలి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన సిద్దరామయ్య ప్రస్తుతం ముఖ్యమంత్రి హోదాలో 16వసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం ద్వారా దేశంలోనే అత్యధికసార్లు బడ్జెట్ సమర్పించినవారిలో రెండోవారిగా నిలిచారు. ఉద్యాన పంటలసాగుకోసం ఉద్యానాల అభివృద్ధి పథకం-2కు రూ.95 కోట్లు కేటాయించనున్నారు. ఉద్యానపంటల విస్తీర్ణం, దిగుబడి, పంటల ఆరోగ్యం, మార్కెటింగ్ సౌకర్యాల పెంపుకోసం రియల్‌టైమ్ ఆధారిత కేంద్రాన్ని ప్రారంభించనున్నారు. ఉద్యానవన రైతుల్లో 52వేలమంది లబ్ధిదారులకు 426 కోట్ల రూపాయలు సహాయధనం ఇవ్వదలిచారు.

విద్యాశాఖకు కేటాయింపు



● అధికంగా రూ.45,286 కోట్లు..

రానున్న ఏడాది కాలంలో విద్యాశాఖకు సీఎం సిద్దరామయ్య ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారు. 2025-26 బడ్జెట్‌లో విద్యాశాఖకు రూ.45,286 కోట్లు (10శాతం) కేటాయించారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖకు 34,955 కోట్లు (8శాతం), విద్యుత్‌శాఖకు రూ26,896 కోట్లు(6 శాతం), గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్‌శాఖకు 26,735 కోట్లు (6శాతం), జలవనరులశాఖకు 22,181 కోట్లు (5శాతం), నగరాభివృద్ధి, వసతిశాఖకు 21,405 కోట్లు (5శాతం), రవాణా, అంతర్గత పాలనా విభాగానికి 20625 కోట్లు (5శాతం), వైద్య ఆరోగ్యశాఖకు 17413 కోట్లు (శాతం), రెవెన్యూ శాఖకు 17,201 కోట్లు (4శాతం), సాంఘిక సంక్షేమం 16955 కోట్లు (4శాతం), ప్రజాపనులు 11,841 కోట్లు (3శాతం), పౌర ఆహార సరఫరాలు 8275 కోట్లు (2శాతం), వ్యవసాయ ఉద్యానవనశాఖలకు 7145 కోట్లు (2శాతం), పశుసంవర్ధక, మత్స్యశాఖలకు 3977 కోట్లు (1శాతం), ఇతర అన్ని శాఖలు కలిపి 1,49,857 కోట్లు (35శాతం) కేటాయించారు.

రెవెన్యూ ద్వారానే 52 పైసలు రాక..



ముఖ్యమంత్రి సిద్దరామయ్య 2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో 52పైసలు రాష్ట్ర రెవెన్యూ పన్నుల ద్వారానే రాబట్టాలని నిర్ణయించారు. రాష్ట్ర పన్నుయేతర ఆదాయం 4శాతం, కేంద్రప్రభుత్వం నుంచి గ్రాంట్ల రూపంలో 4 పైసలు, సెంట్రల్ ట్యాక్స్ వాటా 13పైసలు, అప్పుల రూపంలో 27 పైసలు సాధించదలిచారు.

ఖర్చు ఇలా...

సాంఘిక సంక్షేమానికి 15పైసలు, ఇతర సాధారణ సేవలకు 18పైసలు, అప్పుల చెల్లింపులకు 18పైసలు, నీరు, పారిశుద్ధం కోసం 3 పైసలు, ఇతర సామాజిక సేవలకు 3 పైసలు, ఆరోగ్య రంగానికి 5పైసలు, విద్యారంగానికి 10పైసలు, వ్యవసాయ, జలవనరులు, గ్రామీణాభివృద్ధికి 14 పైసలు, ఇతర ఆర్థిక సేవలకు 14 పైసలుగా నిర్ధారించారు.

సహకారంపై మమకారం..



● రైతులకు రూ.28వేల కోట్ల రుణాలు : సీఎం

సహకారసంఘాల ద్వారా 37లక్షలమంది రైతులకు 28వేల కోట్ల రూపాయలు రుణాలు ఇస్తామని ప్రకటించారు. 2024-25లో 21.78 లక్షలమందికి 18,960 కోట్ల రూపాయలు రాయితీ వడ్డీతో పంట రుణాలు ఇచ్చామన్నారు. ఇటీవల నాబార్డు 58శాతం కోత విధించినా లక్ష్యాన్ని సాధ్యం చేయదలిచామన్నారు. 3వేల సహకార సంఘాలను పూర్తిగా కంప్యూటరీకరణ చేయదలిచామన్నారు. 376 కోట్ల రూపాయలతో గత బడ్జెట్‌లో గోడౌన్‌ల నిర్మాణం చేపట్టదలిచామని, ఇందులో బకాయి ఉన్న 47వేల కోట్ల రూపాయలు విడుదల చేయదలిచామన్నారు. బెంగళూరులో మార్కెట్ కమిటీలలో వాహనాల రద్దీ పెరుగుతున్నందున శివారు ప్రాంతంలో శాటిలైట్ మార్కెట్‌లను ఏర్పాటు చేయదలిచామన్నారు. కల్యాణ-కర్ణాటక అభివృద్ధి మండలి ద్వారా కొప్పళలో గొర్రెలు, మేకల మార్కెట్ నిర్మాణానికి రూ.25కోట్లు, కలబురగిలో ప్రాంతీయ సహకార భవనానికి రూ.10కోట్లు, గ్రామీణ గోడౌన్‌లకు రూ.60కోట్లు కేటాయించదలిచారు.


ఆరోగ్యానికి వందనం..!

● కళ్యాణ కర్ణాటకలో పలు ప్రాథమిక కేంద్రాలను వంద పడకల ఆసుపత్రులుగా మారుస్తూ నిర్ణయం..



బళ్లారి,మార్చి7(ఆంధ్రజ్యోతి): సీఎం సిద్దరామయ్య బడ్జెట్‌లో కళ్యాణ కర్ణాటక ఆరోగ్యానికి పెద్ద పీట వేశారు. బీదర్, కలబుర్గి, యాదగిరి, రాయచూర్, కొప్పళ, బళ్లారి, విజయనగరం ఏడు జిల్లాలో ఆరోగ్య వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు పలు ప్రాజెక్టులు ప్రకటించారు. 24కొత్త ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 7కొత్త పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 10 పడకల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి 30పడకల సామాజిక ఆరోగ్య కేంద్రంగా అప్‌గ్రేడ్ చేయడం. 4కొత్త అర్బన్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 30పడకల కమ్యూనిటీ కేంద్రాలను 50పడకలకు అప్‌గ్రేడ్ చేయడం, కమలాపూర్, కంప్లి, కురుగోడు, షహాబాద్, కుకనూర్, కారటగి, కనకగిరి 100 పడకల తాలూకా ఆసుపత్రులుగా మార్చనున్నారు. 100పడకల తాలూకా ఆసుపత్రులను సిరుగుప్ప, సండూర్, బాల్కి,సేడం, చిత్తాపూర్, జీవర్గి, గంగావతి, కూడ్లగి,షాహాపూర్‌లలో 150 పకడల డివిజనల్ ఆసుపత్రులకు అప్‌గ్రేడ్ చేయడం, బళ్లారిలోని వినికిడి లోపం ఉన్న పిల్లల కోసం ప్రభుత్వ పాఠశాల, హుబ్లీలోని దృష్టిలోపం ఉన్న పిల్లల కోసం పాఠశాలలు ప్రాథమిక పాఠశాల స్థాయి నుండి ఉన్నత పాఠశాల స్థాయికి అప్‌గ్రేడ్ చేయబడుతాయి.

పోలీస్ శాఖను బలోపేతం చేసేందుకుఈసంస్కరణ చర్యలు చేపట్టనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఐదు బాంబు డిటెక్షన్ డిపోజల్ స్క్వాడ్‌లు పనిచేస్తున్నాయి. ఈసంవత్సరం బళ్లారి దావణగేరి, మైసూర్, బెంగళూరు సెంట్రల్ జోన్లలో బాంబు డిటెక్షన్ డిస్పోజల్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేస్తారు. రాష్ట్రంలో ట్రాఫిక్‌ను పర్యవేక్షించడానికి ట్రాఫిక్ ఉల్లంఘన కేసులను గుర్తించడానికి .నియంత్రించడానికి దావణగెర సెంట్రల్ జోన్లలో బళ్లారి విజయపూర్, దక్షిణ కన్నడ జిల్లాలో మొత్తం 60ప్రదేశాల్లో రూ.50కోట్లు ఖర్చుతో ఏఐ ఆధారిత ఎలక్ట్రానిక్ కెమెరాలు అమర్చనున్నారు.



బడ్జెట్ ప్రతులను సభలో ప్రదర్శిస్తున్న జిల్లా మంత్రి భోసరాజు

రాయచూరుకు రింగ్‌రోడ్డు.. విమానాశ్రయం

రాయచూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సిద్ధరామయ్య శుక్రవారం రాష్ట్ర శాసనసభకు సమర్పించిన 2025-26వ వార్షిక బడ్జెట్‌లో జిల్లాకు పలు వరాలు కురుపించారు. రాయచూరు నగరానికి రింగ్ రోడ్డు కోసం నిధుల కేటాయింపుతోపాటు ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న రాయచూరు విమానాశ్రయానికి అదనంగా రూ.53 కోట్లు బడ్జెట్‌లో కేటాయింపు జరిపారు. దీంతో పాటు లింగసుగూరు ఆస్పత్రిని జిల్లా స్థాయి ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయడంతో పాటు మస్కి, సిరవార తాలూకాలోని ప్రాథమిర ఆరోగ్య కేంద్రాలను సముదాయ ఆరోగ్య కేంద్రాలుగా పదోన్నతి చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో పాటు వార్షిక బడ్జెట్‌లో చిన్ననీటి పారుదల శాఖకు 2వేల కోట్లు కేటాయించడంతో జిల్లాలో పలు చెరువులను అభివృద్ధి చేయడంతోపాటు భూగర్భ జలాల పెంపుకోసం పలు ప్రాజెక్టులను చేపట్టనున్నట్లు చిన్ననీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఎస్. భోసరాజు తెలిపారు. కాగా జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో రూ.20 కోట్లతో క్యాన్సర్ విభాగాన్ని మరింత పటిష్టం చేయనున్నారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సెహరీ
6.45	5.20
శనివారం సాయంత్రం	ఆదివారం ఉదయం

మెరుగైన వైద్యకేంద్రంగా విశ్వేశతీర్థ స్మారక ఆసుపత్రి

● 150 పడకల కేంద్రం ప్రారంభోత్సవంలో కేంద్రమంత్రి అమిత్‌షా

మహదేవపుర, మార్చి 7(ఆంధ్రజ్యోతి): సామాన్య ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించే ఆసుపత్రిగా విశ్వేశతీర్థస్మారక కేంద్రం కొనసాగనుందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అభిప్రాయపడ్డారు. మారతహళ్లిలో శ్రీకృష్ణ సేవాశ్రమ ట్రస్టు నిర్మించిన విశ్వేశతీర్థ స్మారక ట్రస్టుకు అనుబంధమైన 150 పడకల అత్యాధునిక ఆసుపత్రిని శుక్రవారం అమిత్‌షా లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భగా అమిత్‌షా మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక విధానాలతో సామాన్య ప్రజలకు ఉత్తమమైన వైద్యసేవలు అందనున్నాయన్నారు. ఉడుపిమఠం సామాన్యుల ఆరోగ్య విషయంలో చొరవ చూపడం సంతోషంగా ఉందన్నారు.



కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను సత్కరిస్తున్న పెజావర స్వామీజీ

60శాతం పడకలు పేదలకోసం కేటాయించడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఉడుపి పెజావరమఠం పీఠాధిపతి విశ్వప్రసన్నతీర్థస్వామిజీ, మాజీ సీఎం యడియూరప్ప, మాజీ మంత్రి అరవింద లింబావళి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, ఆసుపత్రి ట్రస్టు చైర్మన్ కే జయరాజ్, కార్యదర్శి హరిదాస్, మెడికల్ డైరెక్టర్ వాసుదేవరావ్ తదితరులు పాల్గొన్నారు.

అభిమానుల మధ్య దొరస్వామి అంత్యక్రియలు

● అధికార లాంఛనాలతో ప్రక్రియ ● మాజీ ఉపరాష్ట్రపతి సహా పలువురు ప్రముఖుల నివాళి



విషాదంలో కుటుంబ సభ్యులు

బెంగళూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఐదు దశాబ్దాల విద్యారంగంలో ఎన్నో మైలు రాళ్లు సాధించి సమాజసేవ ద్వారా ఎంతోమందికి స్ఫూర్తినిచ్చిన పీఈఎస్ విద్యాసంస్థల వ్యవస్థాపకులు ప్రొఫెసర్ ఎంఆర్ దొరస్వామి అంత్యక్రియలు అభిమానుల ఆవేదన మధ్య ముగిశాయి. గురువారం తుదిశ్వాస వీడిన దొరస్వామి భౌతికకాయాన్ని శుక్రవారం అభిమానులు, విద్యార్థులు, బెంగళూరు చిత్తూరుతోపాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు సందర్శించారు. బనశంకరిలోని ఆయన నివాసంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో దొరస్వామి కృషిని వెలకట్టలేమన్నారు. దశాబ్దాలకాలంగా తనకు ఆయనతో సన్నిహితం ఉందని, ఇద్దరమూ కలసిన ప్రతిసారి ఉన్నతవిద్యలో మార్పులు అనే అంశమే ప్రధానంగా ఉండేదన్నారు. ఉన్నత విద్యారంగంలో మార్పులు తీసుకురావడం ద్వారానే ఆయనకు సరైన నివాళులు అర్పించినట్లు అవుతుందన్నారు. మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై, మంత్రి రామలింగారెడ్డి, మాజీ సీఎం వీరప్పమొయిలీ, అదమ్యచేతన సంస్థ ముఖ్యులు తేజస్విని అనంతకుమార్, ఏపీ ఎమ్మెల్యేలు గురజాల జగన్, భానుప్రకాశ్, అమిలినేని సురేంద్రబాబు పాల్గొన్నారు.

ప్రముఖుల సంతాపం..

రేవా యూనివర్సిటీ ప్రతినిధులు దయానందసాగర్ కుటుంబీకులు, ఆర్‌వీ, రాజరాజేశ్వరినగర్ యూనివర్సిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. మాజీ వీసీలు మహేశప్ప, కించా, ఇండో ఏషియన్ అకాడమీ విద్యాసంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ తుమ్మల ఏకాంబరం నాయుడు, కృష్ణ గ్రూప్ విద్యాసంస్థల వ్యవస్థాపకులు రుక్మాంగదనాయుడు, ఇండియన్ అకాడమీ సోమశేఖర్‌తోపాటు పలు విద్యానిపుణులు నివాళులు అర్పించారు. జస్టిస్ ఎన్ కుమార్, మాజీ చీఫ్ సెక్రటరీ విజయభాస్కర్, ఐపీఎస్ అధికారి చంద్రశేఖర్, నటుడు అభిషేక్ అంబరీశ్‌తోపాటు దొరస్వామికి ఆప్తులుగా ఉన్న ఆనందరావ్, శ్రీనాథ్, ప్రసాద్‌రాజ్ తదితరులు నివాళులు అర్పించారు. ఎంపీలు పీసీ మోహన్, డాక్టర్ సీఎన్ మంజునాథ్, ఎమ్మెల్సీ ఎంఆర్ సీతారాం, మాజీ ఎంపీ కేసీ కొండయ్య, బసవనగుడి ఎమ్మెల్యే రవిసుబ్రమణ్య, కేసీ రామమూర్తి తదితరులు నివాళులు అర్పించారు. కాగా దొరస్వామి కుమారుడు జవహర్‌ను ఆంధ్రజ్యోతి జనరల్ మేనేజర్ జీవీ శ్రీకాంత్ పరామర్శించారు. కమ్మసంఘం అధ్యక్షులు రాజగోపాలనాయుడు, కార్యదర్శి లీలాశంకర్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. తెలుగు విజ్ఞాన సమితి అధ్యక్షులు రాధాకృష్ణరాజు, రామకృష్ణ ఆశ్రమ గురువు తద్వ్యక్తానంద స్వామిజీ, వీరేశానందస్వామిజీ, మాజీ మంత్రి రామచంద్రగౌడ విచారం వ్యక్తం చేశారు.

తరలివచ్చిన అభిమానులు

మధ్యాహ్నందాకా అభిమానుల సందర్శనకు అవకాశం ఉండగా అనంతరం ఎస్ఎస్ఎం పబ్లిక్ స్కూల్, హనుమంతనగర్ పీఈఎస్ క్యాంపస్, ఆర్‌ఆర్‌నగర్ రింగ్‌రోడ్డులోని పీఈఎస్ యూనివర్సిటీ క్యాంపస్‌లకు పార్థికవదేహాన్ని తీసుకెళ్లగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపకులు, ఉద్యోగులు కడచూపు చూశారు. అనంతరం పోలీసుల లాంఛనాలు జరిపారు. కుమారుడు జవహర్ అంత్యక్రియలు జరిపారు.

ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో..

ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ప్రొఫెసర్ దొరస్వామికి ఘనంగా నివాళులు అర్పించారు. ఇదే కళాశాలలో దొరస్వామి పూర్వ విద్యార్థి కాగా ఆయనను స్మరించుకున్నారు. దొరస్వామి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ప్రిన్సిపాల్ పీటీ శ్రీనివాసనాయక్, కన్నడ అధ్యాపకులు రుద్రేశ్ అదరంగి తదితరులు పాల్గొన్నారు. లాల్‌బాగ్ ఉద్యానవనంలో వాకర్స్ బృందం నివాళులు అర్పించారు.



నివాళులు అర్పిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



జవహర్‌ను పరామర్శిస్తున్న ఆంధ్రజ్యోతి జనరల్ మేనేజర్ జీవీ శ్రీకాంత్

గోల్డ్ మాల్..!



- బంగారు అక్రమ రవాణే లక్ష్యం..!
- 27 సార్లు దుబాయ్ వెళ్లొచ్చిన నటి రన్యారావ్
- స్మగ్లింగ్‌కు ప్రత్యేక జాకెట్
- సహకరించిన ఓ పోలీసు అధికారి.. మరో రాజకీయ నేత

7

మృత్యుకుంట..!



ప్రమాదం జరిగిన వ్యవసాయ కుంట

- ముగ్గురిని బలిగొన్న నీటి కుంట
- మోటార్ మరమ్మతు చేస్తుండగా షార్ట్ సర్క్యూట్..
- ఒకరిని కాపాడబోయి మరొకరు..

8



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా కాళేశ్వరస్వామి రథోత్సవం

కంప్లి, మార్చి 7(ఆంధ్రజ్యోతి) : విజయనగ జిల్లాలోని హగరిబొమ్మనహళ్లి పట్టణంలో శుక్రవారం కాళేశ్వరస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం ఊరేగింపు చేపట్టారు. సాయంత్రం ఆలయం నుండి ఎదురు బసవన్న కట్ట వరకు రథోత్సవాన్ని ఊరేగించారు. విజయనగరం జిల్లాలో నల్లమూలల గ్రామాలు, పట్టణాల నుంచి తరలివచ్చి పూలు పండ్లతో మొక్కులను సమర్పించుకున్నారు. ఈరథోత్సవాన్ని కన్నుల పండుగగా జరుపుకుంటామని పట్టణ వాసులు తెలిపారు.

హంద్రీనీవాను వెడల్పు చేయాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువను 10వేల క్యూసెక్కుల సామర్థ్యంతో వెడల్పు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ శుక్రవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. కాలువను వెడల్పు చేయడంతోపాటు పంట కాలువలు తవ్వి ఆయకట్టుకు నీరు ఇవ్వాలని రైతులు కోరుతుంటే లైనింగ్ పనులకు ప్రభుత్వం టెండర్లు పిలవడం సరికాదన్నారు. హంద్రీనీవాను వెడల్పు చేయకుండా అత్యంత వెనుకబడిన అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలను ఎలా అభివృద్ధి చేస్తారని ప్రశ్నించారు. సీమ అభివృద్ధికి సాగు నీటి వనరుల అభివృద్ధి కీలకమన్నారు. అనేక పోరాటాల ఫలితంగానే హంద్రీనీవాకు నీరు వచ్చిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం హంద్రీనీవా సామర్థ్యాన్ని 6300 క్యూసెక్కులు చేస్తామని టెండర్లు పిలిచారన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 6300 క్యూసెక్కులకంటే ఎక్కువ నీరు తెస్తామని ఎన్నికల ముందు చెప్పారన్నారు. ప్రస్తుతం ఖరారు చేసిన టెండర్లలో 3850 క్యూసెక్కులకే పరిమితం చేయడం, రెండో దశ కాలువ లైనింగ్ పనులకు సిద్ధమవడం ఏరు దాటాక తెప్ప తగలేసినట్లు ఉందని విమర్శించారు. లైనింగ్ పనులను రాప్తాడు ఎమ్మెల్యే కూడా వ్యతిరేకిస్తున్నందున మిగిలిన ఎమ్మెల్యేలు వారి వైఖరులను ప్రకటించాలన్నారు. జిల్లా ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి ఈ బడ్జెట్ సమావేశాల్లో ముఖ్యమంత్రితో సానుకూల నిర్ణయం ప్రకటింపజేయాలని కోరారు.

మరో ఇద్దరికి ఏఓలుగా ఉద్యోగోన్నతి


ఉత్తర్వులు అందుకుంటున్న చంద్రశేఖర్

అనంతపురం విద్య, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ యాజమాన్య పరిధిలో మరో ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లకు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు (ఏఓ)గా ఉద్యోగోన్నతి కల్పించారు. ఈ మేరకు శుక్రవారం జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, సీఈఓ రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలో ఇటీవలి వరకూ నాలుగు ఏఓ పోస్టులు ఖాళీగా ఉండేవి. రెండ్రోజుల క్రితం ముగ్గురికి ఉద్యోగోన్నతి ఇచ్చి, భర్తీ చేశారు. అందులో ఒకరు తనకు ఏఓ ఉద్యోగోన్నతి వద్దని... లిఖితపూర్వకంగా రాసి అధికారులకు ఇవ్వడంతో ఆ పోస్టు ఖాళీ పడింది. అప్పటికే ఖాళీ ఉన్న మరొకటి కలిపి రెండు పోస్టులకు ప్యానల్ సీనియారిటీ జాబితాలో తర్వాతి స్థానాల్లో ఉన్న ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లకు ఏఓలుగా ఉద్యోగోన్నతి కల్పించారు. సీనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్‌కు ప్రమోషన్ ఇస్తూ... నంబులపూలకుంట మండల పరిషత్ కార్యాలయానికి నియమించారు. మరో సీనియర్ అసిస్టెంట్ రాజేంద్రప్రసాద్‌కు సైతం ప్రమోషన్ ఇస్తూ అగళి మండల పరిషత్ కార్యాలయానికి పోస్టింగ్ ఇచ్చారు. కొత్తగా ప్రమోషన్ పొందిన ఏఓలకు జడ్పీ ఉద్యోగులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

బాలికపై అత్యాచారం కేసులో

ముద్దాయికి 20 ఏళ్ల జైలుశిక్ష

అనంతపురం క్రైం, మార్చి7(ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం కేసులో ముద్దాయి రమావత్ డాక్యా నాయక్‌కు 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయాధికారి రాజ్యలక్ష్మి శుక్రవారం తీర్పు వెలువరించారు. బాధితురాలికి రూ.5లక్షల పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. 2019 మే 17వ తేదీన వజ్రకరూరు మండలం వెంకటాంపల్లి పెద్ద తండాకు చెందిన డాక్యానాయక్ పదేళ్ల బాలికను అపహరించాడు. పొలంలోని చింతచెట్టు వద్దకు ఎత్తుకెళ్లి, తన పంచెతో బాలిక కాళ్లు, చేతులు కట్టేసి, నోట్లో గుడ్డలు కుక్కి అత్యాచారానికి ఒడిగట్టాడు. దీనిపై బాలిక ఫిర్యాదు మేరకు అప్పటి వజ్రకరూరు ఎస్ఐ కేసు నమోదు చేశారు. అప్పటి గుంతకల్లు డీఎస్పీ ఖాసీంసాబ్ కేసు దర్యాప్తు చేసి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో పోక్సో కోర్టు న్యాయాధికారి రాజ్యలక్ష్మి 14 మంది సాక్షులను విచారించారు. నేరం రుజువు కావడంతో శుక్రవారం ముద్దాయికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధించారు. ఈ కేసులో ముద్దాయికి శిక్ష పడేలా వ్యవహరించిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ జగదీస్ అభినందించారు.

ప్రవేశ పరీక్ష కేంద్రాల పెంపు

మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకులాల కన్వీనర్ జోనాథన్

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశ పరీక్షకు సంబంధించి దరఖాస్తులు వస్తుండడంలో ఏడు పరీక్షా కేంద్రాలను పెంచుతున్నట్లు ఆ గురుకులాల జిల్లా కన్వీనర్ జోనాథన్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఏప్రిల్ 27న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామని, పెంచిన పరీక్షా కేంద్రాలను విద్యార్థులు గమనించాలని పేర్కొన్నారు.

పెంచిన పరీక్ష కేంద్రాలు..

కళ్యాణదుర్గంలోని ప్రభుత్వ బీసీ బాలికల కళాశాల వసతి గృహం, అనంతపురంలోని రామ్‌నగర్‌లో ఉన్న శింగనమల ప్రభుత్వ బీసీ బాలికల కళాశాల వసత గృహం, అనంతపురంలోని బాయ్స్ జూనియర్ కళాశాలలోని ఉన్న బీసీ నార్పల బాలుర కళాశాల వసతిగృహం, అనంతపురం హౌసింగ్‌బోర్డు మెయిన్ రోడ్డులో ఉన్న నార్పల బీసీ కళాశాల బాలికల వసతి గృహం, రాయదుర్గంలోని బీసీ బాలుర వసతిగృహం, అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రి వెనుకవైపు ఉన్న బీసీ బాలికల కళాశాల వసతిగృహం, ధర్మవరంలోని బీసీ బాలుర కళాశాల వసతి గృహాలు పెంచిన పరీక్షా కేంద్రాల జాబితాలో ఉన్నాయి.

నాయకులకు తప్పిన ప్రమాదం

అమరాపురం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ నాయకులకు పెనుప్రమాదం తప్పింది. వివరాల మేరకు పని నిమిత్తం మడకశిరకు వెళ్లి తిరుగుప్రయాణంలో స్టీల్ ఫ్యాక్టరీ వద్దకు చేరుకోగానే కారు ముందుభాగాన టైర్లు పగలడంతో ప్రమాదం చోటు చేసుకుంది. కారులో తెలుగుదేశం పార్టీ నాయకులు గణేష్, ఆల్‌గుండేగౌడ్, జయప్ప, నింగేగౌడ్ ప్రయాణిస్తున్నారు. వారిలో ఆల్‌గుండేగౌడ్ తలకు స్వల్ప గాయమైంది. సమాచారం అందుకున్న ఏఎస్ఐ రామాంజినేయులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాగా ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మాజీ జడ్పీటీసీ నరసింహమూర్తి, మాజీ ఎంపీపీ కృష్ణమూర్తి, నాయకులు మారుతీప్రసాద్ తదితరులు వారిని పరామర్శించారు.

పెనుకొండ కొండకు నిప్పు

పెనుకొండ రూరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పెనుకొండ కొండకు శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో వేలాది మొక్కలు అగ్నికి ఆహుతయ్యాయి. బీజేవీవీఎస్ సభ్యులు భోగసముద్రం జలవనసంరక్షణ సభ్యులు మంటలు ఆర్పడానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఫైర్ సిబ్బంది వచ్చి తమవంతుగా ప్రయత్నంచేశారు.

మట్టే కదా..!

- జిల్లాలో చెలరేగిన మట్టి మాఫియా
- కొండలు పిండి.. చెరువులు ఖాళీ..
- సొమ్ము చేసుకుంటున్న స్వార్థపరులు
- పట్టించుకోని రెవెన్యూ, పోలీసు, మైన్స్, ఇరిగేషన్ శాఖలు


దేవరపల్లిలోని కొండను తవ్వేసిన మట్టి మాఫియా

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మట్టి మాఫియా చెలరేగిపోతోంది. రోడ్లకు, పొలాలకు ఇష్టానుసారంగా మట్టిని తరలించేస్తున్నారు. ఇటీవల ఇప్పేరులో అక్రమంగా మట్టిని తరలిస్తున్న ఎక్స్‌కవేటర్, టిప్పర్లను మైన్స్ అధికారులు అలా పట్టుకుని ఇలా వదిలేశారు. పామిడి మండలం దేవరపల్లి కొండల్లో, గార్లదిన్నె మండలం జంబులదిన్నె చెరువులలో మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పగటి పూట రైతుల పంట పొలాల పేరుతో మట్టిని తరలిస్తున్న మాఫియా...రాత్రి పూట అసలు దందా చేస్తోంది. ఇంత మట్టి దోపిడీ జరుగుతున్నా మైన్స్, ఇరిగేషన్, రెవెన్యూ పోలీసు శాఖ అధికారులు తమకేమి సంబంధం లేదన్నట్లు ప్రేక్షకపాత్రలో మిన్నకుండిపోతున్నారు. ఆయా శాఖల మధ్య సమన్వయలోపమే మట్టి మాఫియా ఆగడాలకు కారణమవుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి ఇప్పటికే పలు ఫిర్యాదులు వెళ్లినా వాటిని బుట్టదాఖలు చేస్తున్నట్లు సమాచారం.

దేవరపల్లి కొండ, ఇప్పేరు చెరువు మట్టి తరలింపు

పామిడి మండలం దేవరపల్లి వద్ద ఉన్న ఓ కొండను పిండి చేసేశారు. టిప్పర్ రూ.5వేలు చొప్పున రోజుకు 50 టిప్పర్లు తోలేస్తున్నారు. కొన్నిరోజులు పగలు, మరికొన్ని రోజులు రాత్రి పూట మట్టిని తోడేస్తున్నారు. కూడేరు మండలం ఇప్పేరు చెరువులో పొట్టిచెరువు గ్రామానికి చెందన ఓ చోటా నాయకుడు మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్నారనే సమాచారంతో మైన్స్ అధికారులు ఇటీవల దాడి చేసి ఎక్స్‌కవేటర్, టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు. నామమాత్రపు జరిమానాతో ఆ వాహనాలను వదిలేశారు. తిరిగి ఆ చోట నాయకుడు ఇప్పేరు చెరువు నుంచి పగలు, రాత్రి తేడా లేకుండా మట్టి తోలుతున్నాడు. ఇవి ఉదాహరణలు మాత్రమే. జిల్లాలో చాలా చోట్ల ఇదే తంతు సాగుతోంది. కమర్షియల్ వాడకానికి 500క్యూబిక్ మీటర్ల మట్టిని తరలించేందుకు అనుమతి ఇస్తారు. రూ. 65వేలు చెల్లించి మట్టిని తరలించాలి. ఇది అధికారికంగా ప్రభుత్వం చెరువులో మట్టికి నిర్ణయించిన ధర అయినప్పటికీ దీనిని ఎవరూ పట్టించుకోవడం లేదు.

మట్టిమాఫియాకు అధికారులు అండ

జిల్లాలో మట్టిమాఫియా ఆగడాలకు సంబంధిత శాఖల అధికారులే అండగా నిలుస్తుండటం గమనార్హం. మట్టి మాఫియాతో మైనర్ ఇరిగేషన్, భూగర్భ గనులు, రెవెన్యూ, పోలీసులు కుమ్మక్కై ఇష్టారీతిలో మట్టిని తరలించేందుకు సహకరిస్తున్నారనే ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా 301 చెరువులు ఉన్నాయి. ఇందుకు ప్రధానంగా మైనర్ ఇరిగేషన్ ఇంజనీర్లు ముడుపులు పుచ్చుకుని వంత పాడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పామిడి మండలం దేవరపల్లి కొండలు, గుట్టలు, కూడేరు మండలం ఇప్పేరు, గార్లదిన్నె మండలం జంబులదిన్నె చెరువులలో అక్రమంగా మట్టిని తరలించిన ఉందంతాలే ఇందుకు అద్దం పడుతున్నాయి.


టిప్పర్‌లోకి మట్టిని నింపుతున్న ఎక్స్‌కవేటర్

చర్యలు తీసుకుంటాం



కొండలు, చెరువుల్లో మట్టిని తరలించినట్లు మా దృష్టికి వస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం. ఇప్పేరు, పామిడి మండలాల నుంచి పలు ఫిర్యాదులు ఉన్నాయి. వాటిపై నిఘా ఉంచాం. ఇటీవల పొట్టిచెరువుకు చెందిన ఎక్స్‌కవేటర్, టిప్పర్లను సీజ్ చేశాం. చెరువుల్లో మట్టిని తరలించేందుకు మైనర్ ఇరిగేషన్, మైన్స్, రెవెన్యూ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు శాఖల నుంచి తప్పనిసరిగా అనుమతి ఉండాలి. కమర్షియల్, ఇతర వాటికి ఫీజు వసూలు చేస్తారు. రైతులకు మాత్రమే ఉచితంగా మట్టిని తరలించుకునే వెసులుబాటు ఉంది. అనుమతికి మించిన మట్టిని తరలించినట్లు తేలితే ఉన్నతాధికారులకు విచారణ నివేదిక అందజేస్తాం. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

- వెంకటేశ్వర్లు, జిల్లా భూగర్భగనుల శాఖ అధికారి

దానిమ్మ రైతుకు పరిహారం చెల్లించండి

వ్యవసాయ శాఖకు వినియోగదారుల కమిషన్ ఆదేశం

అనంతపురం క్రైం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): దానిమ్మ రైతుకు పరిహారం చెల్లింపు విషయంలో వ్యవసాయ శాఖాధికారులకు జిల్లా వినియోగదారుల ఫోరంలో మొట్టికాయ వేసింది. బాధిత రైతుకు పంట నష్టం పరిహారం చెల్లింపులో నిర్లక్ష్యంగా వ్యవహరించారనీ, వెంటనే చెల్లించాలని ఆదేశించింది. గుమ్మఘట్ట మండలం గోల్లపల్లికి చెందిన రైతు గౌని రాఘవేంద్ర రెడ్డి 2021 ఖరీఫ్ సీజన్‌లో భారీ వర్షాల కారణంగా దానిమ్మ పంట పూర్తిగా నష్టపోయాడు. అతడికి ప్రభుత్వం ప్రకటించిన పంట బీమా పరిహారంగా రూ.2.61 లక్షలు, రైతు అనుభవించిన మనోవేదనకుగాను మరో రూ.50వేలు చెల్లించాలని జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు శ్రీలత శుక్రవారం తీర్పు చెప్పారు. ఫిర్యాదుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. రైతు గౌని రాఘవేంద్రరెడ్డి 2021 ఖరీఫ్ సీజన్‌లో భారీ వర్షాల కారణంగా దానిమ్మ పంట పూర్తిగా నష్టపోయాడు. పంట బీమా జాబితాలో తన పేరున్నా పరిహారం ఎందుకు చెల్లించలేదని అధికారులను సంప్రదించారు. 2022లో స్పందన ద్వారా అనేకసార్లు వినతిపత్రాలు సమర్పించినా పంట బీమా పరిహారం మాత్రం అందలేదు. చివరికి 2023లో వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించాడు. వ్యవసాయ అధికారులు, ఉన్నతాధికారులకు నోటీసులు జారీ చేశారు. రైతు తన పంట బీమా వివరాలను వెబ్‌పోర్టల్‌లో నమోదు చేయలేదనీ, అందుకే పరిహారం అందలేదని అధికారులు వాదించారు. అదే భూమిలో ముందుగా గౌని సత్యనారాయణ రెడ్డి అనే వ్యక్తి పంట బీమా నమోదు చేసినట్లు పేర్కొన్నారు. 2021లోనే అదే భూమిలో భూసార పరీక్ష ఆధారంగా వేరే పంటకు బీమా పరిహారం చెల్లించామని తమ నిర్లక్ష్యం ఏమీ లేదని పేర్కొన్నారు. రైతు తన పంట బీమా నమోదు పూర్తి చేసి, అనేకసార్లు అధికారులను కలిశాడనీ, తగిన చర్యలు తీసుకోలేదని కమిషన్ గుర్తించింది. దానిమ్మ పంటకు బీమా పరిహారం అందిన రైతుల జాబితాలో అతని పేరు ఉన్నా.. పరిహారం ఇవ్వకపోవడానికి తెలిపిన కారణాలు సబబుగా లేవని పేర్కొంది. అధికారుల నిర్లక్ష్యం వల్ల రైతు తీవ్ర ఆర్థిక నష్టం చవిచూశాడని స్పష్టం చేసింది. ప్రతిపాదించిన ఎకరాకు రూ.33,600 పరిహారం హక్కుగా ఉందనీ, మొత్తం 7.78 ఎకరాలకు రూ.2.61 లక్షలు చెల్లించాలని తీర్పు ఇచ్చింది. రైతు పంట బీమా కోసం చేసిన ప్రయత్నంలో అనుభవించిన మానసిక వేదనను కమిషన్ గుర్తించిందని అందుకు పరిహారంగా మరో రూ.50వేలు వ్యవసాయ శాఖ అధికారులు చెల్లించాలని పేర్కొంది. ఈ మొత్తం 45 రోజుల్లో చెల్లించకపోతే 9శాతం వార్షిక వడ్డీతో చెల్లించాలంటూ జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు శ్రీలత, మెంబర్ డి గ్రేస్ మేరీతో కూడిన ధర్మాసనం తీర్పు చెప్పింది.

రాక్రీట్ అవినీతిని తేల్చండి

తోపు కాజేసిన సొమ్ము రికవరీ చేయండి

అసెంబ్లీలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత


అసెంబ్లీలో మాట్లాడుతున్న పరిటాల సునీత

అనంతపురం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి చెందిన రాక్రీట్ సంస్థ అవినీతిని నిగ్గు తేల్చాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రభుత్వాన్ని కోరారు. ఆ సంస్థ అవినీతిలో భాగస్వాములైన తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అక్రమాలపై విజిలెన్స్ విచారణను త్వరితగతిన పూర్తి చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఆమె శుక్రవారం అసెంబ్లీలో మాట్లాడుతూ.. వైసీపీ హయాంలో పేదల ఇళ్ల నిర్మాణం పేరుతో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని అన్నారు. తాను తోపునని చెప్పుకునే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి.. రాక్రీట్ సంస్థ పేరుతో చేసిన అక్రమాలు అన్నీఇన్నీ కావని అన్నారు. ఆ సంస్థ ద్వారా 50 వేల ఇళ్ల నిర్మాణాలు చేపట్టి ఇసుక, సిమెంట్, ఇనుము ఇతర వాటిలో వందల కోట్లు దోపిడీ చేశారని అన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే కాకుండా వైఎస్సార్, పల్నాడు, గుంటూరు, ఎన్టీఆర్, ఏలూరు, విజయనగరం, విశాఖ జిల్లాల్లో గృహ నిర్మాణపనుల్లో అనేక అక్రమాలు జరిగాయని అన్నారు. వేల సంఖ్యలో ఇళ్లు నిర్మించామని గొప్పలు చెబుతున్న ఈ తోపు సంస్థ నిర్మించింది వందల సంఖ్యల్లోనే అని అన్నారు. రాక్రీట్ సంస్థ అవినీతిని గమనించి వైసీపీ ప్రభుత్వం ఆ సంస్థ నిర్మిస్తున్న 13 వేల ఇళ్లను రద్దు చేసిందని అన్నారు. పునాది నిర్మించాక ఒక్కో ఇంటికి మొదటి విడతగా రూ.60 వేలు చెల్లించాలనే విషయాన్ని పక్కనబెట్టి, ఇళ్లు పూర్తయినట్లు అధికారులు కాగితాల్లో చూపించి రూ.కోట్లల్లో బిల్లులు చెల్లించారని అన్నారు. కొన్ని చోట్ల ఇళ్లు నిర్మించకుండా బిల్లులు కాజేశారని, ఒకే పేరుతో పదుల సంఖ్యలో ఇళ్లు తీసుకున్నారని అన్నారు. దీనిపై తాము ముఖ్యమంత్రి చంద్రబాబుకు, గృహ నిర్మాణ శాఖ మంత్రికి ఆధారాలతో ఫిర్యాదు చేశామని, కూటమి ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించిందని అన్నారు. విజిలెన్స్ విచారణను వేగంగా పూర్తి చేయించి, రాక్రీట్ సంస్థ కాజేసిన మొత్తాన్ని రికవరీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గతంలో ప్రకాష్‌రెడ్డి అక్రమాల మీద హౌసింగ్ అధికారులు ఒక నివేదిక సిద్ధం చేశారని, దాన్ని బయటకు రానివ్వకుండా అధికారం అండతో తొక్కిపెట్టారని అన్నారు. ఆ నివేదికను తీసుకుంటే రాక్రీట్ అక్రమాలు పూర్తిస్థాయిలో బయటకొస్తాయని అన్నారు. ప్రకాష్‌రెడ్డి అక్రమాలు అక్కడితో ఆగ లేదని... ఇళ్లను నిర్మించేందుకు వేరే రాష్ట్రం నుంచి వచ్చిన సబ్ కాంట్రాక్టర్‌కు బిల్లులు ఇవ్వకుండా బెదిరించి, వారి కార్మికులను బంధించిన గొప్ప చరిత్ర ఆయనకే దక్కుతుందని విమర్శించారు. లబ్ధిదారుల జాబితా తీసుకుని, వారికి ఇళ్లు దక్కాయా లేదా అని పరిశీలించాలని కోరారు. ఈ అవినీతి అక్రమాల కారణంగా ఆరేళ్లుగా పేదల సొంతింటి కల నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి న్యాయం చేయాలని ప్రభుత్వానికి, మంత్రికి ఆమె విజ్ఞప్తి చేశారు.

హోలీకి ప్రత్యేక రైలు

గుంతకల్లు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): హోలీ పండుగను పురస్కరించుకుని ప్రయాణికుల రద్దీ నియంత్రణకు గుంతకల్లు మీదుగా బెంగళూరు-కలబురగి మధ్య ఓ ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బెంగళూరు-కలబురగి (నంబర్ 06519) ప్రత్యేక రైలు ఈ నెల 13, 14 తేదీల్లో రాత్రి 9-15 గంటలకు బెంగళూరులో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7-40 గంటలకు కలబురగికి చేరుకుంటుందని తెలిపారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నంబరు 06520) ఈ నెల 14, 15 తేదీల్లో కలబురగిలో ఉదయం 9-35 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 8 గంటలకు బెంగళూరుకు చేరుకుంటుందని తెలిపారు. ఈ రైలు యలహంక, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, క్రిష్ణా, యాద్గిర్, షాద్‌నగర్ స్టేషన్ల మీదుగా వెళుతుందని తెలియజేశారు.

రేపు విద్యుత్ శాఖ రిటైర్డ్ ఉద్యోగుల సమావేశం

అనంతపురంరూరల్,మార్చి7(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ విద్యుత్‌శాఖ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా సమావేశం ఈనెల 9న నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి యూసుఫ్ తెలిపారు. ఆమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నగరంలోని జేఎన్‌టీయూ రోడ్డులోని విద్యుత్తు శాఖ ప్రధాన కార్యాలయంలో ఉద యం 10:30గంటలకు సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. అసోసియేషన్ సభ్యులు సమావేశంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

సెలవు రోజుల్లోనూ అభ్యంతరాల స్వీకరణ

అనంతపురం విద్య, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల తాత్కాలిక సీనియారిటీ జాబితాపై సెలవు రోజుల్లోనూ అభ్యంతరాలను స్వీకరిస్తామని డీఈఓ ప్రసాద్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం, ఆదివారం సెలవు దినాలైనా అభ్యంతరాలు స్వీకరిస్తామని తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ మునిసిపల్, జిల్లాపరిషత్, మండలపరిషత్ యాజమానాల్లో పనిచే సే టీచర్లు, ప్రధానోపాధ్యాయులు జా బితాపై అభ్యంతరాలుంటే చెప్పవచ్చునన్నారు. జిల్లా కేంద్రంలోని సైన్స్ సెంటర్‌లో ఉదయం 10 గంటల నుంచి సా యంత్రం 5 గంటల వరకూ అభ్యంతరాలు స్వీకరిస్తామని డీఈఓ పేర్కొన్నారు.

చీనీ టన్ను రూ.23 వేలు

అనంతపురం రూరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.23వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.2,600, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 571 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

పరిగి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పెన్నానది నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను శుక్రవారం పట్టుకున్నట్లు వీఆర్ఓ శ్రీనివాస తెలిపారు. రొద్దం మండలం మరువపల్లి గ్రామానికి చెందిన కిష్టప్ప ట్రాక్టర్‌లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు తమకు సమాచారం అందడంతో వె ళ్లి పట్టుకోవడం జరిగిందన్నారు. ట్రాక్టర్‌ను పోలీసుస్టేషన్ వద్ద ఉంచినట్లు వివరించా రు. కాగా ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోందని, వెంటనే అడ్డుకట్ట వేయాలని పైడేటి గ్రామస్థులు కోరుతున్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

అగళి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మండ లం కేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాలలో శు క్ర వారం టెన్నిస్‌బాల్ క్రికెట్ లీగ్-2 టోర్నమెంట్‌ను జడ్పీటీసీ ఉమేష్ ప్రారంభించా రు

ఆదుకోండి..

- రెవెన్యూ, పంచాయతీ అధికారుల ఎదుట ఓ మహిళ వేడుకోలు

పావగడ, మార్చి 7(ఆంధ్రజ్యోతి): తాను, నలుగురు పిల్లలు పాతమిద్దెలో నివాసముంటున్నామని, అది ఎప్పుడైనా కూలవచ్చని, తనకు ఇల్లు నిర్మించి ఆదుకోవాలని ఓ మహిళ అధికారులను వేడుకుంది. వీరంపల్లి గ్రామానికి చెందిన సునీత శుక్రవారం రెవెన్యూ, పంచాయత అధికారుల ఎదుట తన దీనస్థితిని వెల్లబోసుకుంది. భర్తను కోల్పోయి నలుగురు పిల్లలతో తాను జీవనం సాగిస్తున్నానంటూ తెలిపింది. రేషన్‌కార్డు తనకు లేదని, ఇవ్వాలని ఎన్నిసార్లు అర్జీ పెట్టుకున్నా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేసింది. వితంతు పింఛన్ కోసం అధికారులను వేడుకున్నానని, కరుణించలేదని గోడు వెల్లబోసింది. కూలి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నానని, తనకు రేషన్‌కార్డు, వితంతు పింఛన్ ఇవ్వాలని కోరింది. సునీతకు వెంటనే ఇల్లు నిర్మించి ఇవ్వాలని, రేషన్‌కార్డు, వితంతుపింఛన్ మంజూరు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పూజారప్ప రెవెన్యూ గ్రామ పంచాయతీ అధికారులను డిమాండ్ చేశారు. లేనిపక్షం లో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామన్నారు.


దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన సునీత

నేటి నుంచి కృష్ణాజలాల బంద్


రెగ్యులేటర్ నుంచి రిజర్వాయర్‌కు చేరుతున్న కృష్ణాజలాలు

బెళుగుప్ప, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు కృష్ణా జలాలు సరఫరా శనివారంతో ముగియనున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో తాగునీటి కోసం శ్రీశైలం జలాశయం నుంచి మిగులు జలాలు 40 టీఎంసీలు హంద్రీనీవా పథకం నుంచి చేరాల్సి వుంది. హంద్రీనీవా అధికారులు తెలిపిన మేరకు.. కృష్ణా జలాలను గత యేడాది ఆగస్టు 8వ తేదీ నుంచి విడుదల చేశారు. హంద్రీనీవా పథకం ఫేజ్-1 మెయిన్ కెనాల్ నుంచి జీడిపల్లి రిజర్వాయరుకు 16.223 టీఎంసీలు తరలించారు. ఈ సీజన్‌లో జీడిపల్లి రిజర్వాయరు నుంచి హంద్రీనీవా ఫేజ్-2 కెనాల్‌కు 11.862 టీఎంసీలు విడుదల చేశారు. పీఏబీఆర్‌కు 2.146 టీఎంసీలు మండలంలోని శీర్పి, బెళుగుప్ప చెరువులకు పంపుహౌస్ నుంచి 0.519 టీఎంసీలు విడుదల చేశారు. జీడిపల్లి రిజర్వాయరు నుంచి ఔట్‌ఫ్లో 14.437 టీఎంసీ వెళ్లిందని అధికారులు వెల్లడించారు.

130 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో..

బెళుగుప్ప మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు కృష్ణా జలాల 130 క్యూసెక్కులు వస్తున్నట్లు శుక్రవారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 402 క్యూసెక్కులు వెళుతున్నాయని పేర్కొన్నారు. రిజర్వాయరులో ప్రస్తుతం 1.526 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ సుమన జయంతి

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి7(ఆంధ్రజ్యోతి): బీసీ స్టడీ సర్కిల్‌లో త్వరలో నిర్వహించే మెగా డీఎస్సీ ఉచిత ఆన్‌లైన్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ సుమన జయంతి శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. టెట్‌లో అర్హతసాధించిన బీసీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరీలకు చెందిన అభ్యర్థులు అర్హులన్నారు. టెట్‌లో అర్హత సాధించిన మార్కుల జాబితా, నేటివిటీ, కుల, ఆదాయ ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు దరఖాస్తుకు జతపరచాలన్నారు. ఈ నెల 10వ తేదీ నుంచి దరఖాస్తులను నగరంలోని బీసీస్టడీ సర్కిల్ కార్యాలయంలో అందజేయడం, అభ్యర్థులు పూరించిన దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందన్నారు. వివరాలకు 08554-275575 నంబరులో సంప్రదించాలన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

దామెర్ల రామారావు (జయంతి)




దేశం గర్వించదగ్గ చిత్రకారులలో ఒకరైన దామెర్ల రామారావు 1897 మార్చి 8న తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రిలో జన్మించారు. రామారావు ప్రతిభను ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆస్వాల్డ్ కూల్డ్రే గుర్తించి సొంతఖర్చుతో బొంబాయిలోని జేజే స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌కు పంపారు. 'మేయో' బంగారు పతకాన్ని పొందారు. ఆయన గీసిన పుష్పాలంకరణ, గొల్లపడుచు, గోదావరి లోయ వంటి చిత్రాలు ఎంతో పేరొందాయి. బ్రిటీష్ ఎంపైర్ ప్రదర్శనశాలలో ఆయన చిత్రాలు ఏడాదిపాటు ప్రదర్శనకు ఉంచడం చిత్రకళా ప్రతిభకు తార్కాణం. 1923లో ఆర్ట్స్ స్కూల్ ఏర్పాటు చేసి ఎంతో మంది యువతకు శిక్షణ ఇచ్చారు. 28వ యేట 1925 ఫిబ్రవరి 6న అకాలమరణం చెందడం చిత్రకళారంగానికి తీరని లోటు. ఆయన జ్ఞాపకార్థం ఒక చిత్రకళా మందిరం ఏర్పాటు చేశారు.

సాహిర్ లుధియాన్వి (జయంతి)



'పద్మశ్రీ' గ్రహీత సాహిర్ లుధియాన్వి 1921 మార్చి 8న పంజాబ్ రాష్ట్రం లూధియానాలో జన్మించారు. హిందీ, ఉర్దూ భాషలలో కవిగా, సినీ గేయ రచయితగా పేరొందారు. గజల్స్‌లో రాణించారు. సమాజంలోని పలు అంశాలు, యుద్ధంపై రచనలు చేశారు. 1940-70 మధ్య అప్పటి యువత ఆలోచనలకు అనుగుణంగా రచనలు సాగించారు. పలు ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలు పొందారు. 1980 అక్టోబరు 25న గుండెపోటుతో కన్నుమూశారు.

వసుంధరరాజే సింధియా (పుట్టినరోజు)



ధోల్‌పూర్ రాజవంశస్థురాలైన వసుంధరరాజే సింధియా 1953 మార్చి 8న ముంబైలో జన్మించారు. ఆమె రాజస్థాన్‌కు 2003 నుంచి 2008 వరకు, 2013 నుంచి 2018 వరకు రెండుసార్లు ముఖ్యమంత్రిగా కొనసాగారు. కేంద్రమంత్రిగానూ వ్యవహరించారు. బీజేపీ యువమోర్చాకు ఉపాధ్యక్షురాలిగా వ్యవహరించారు. మహిళా సాధికారతకోసం ఆమె చేసిన సేవలను గుర్తిస్తూ 2007లో ఐక్యరాజ్యసమితిచే 'ఉమెన్ టుగెదర్ అవార్డ్' పొందారు. 2018లో స్కాచ్ సమ్మిట్‌లో 'ఉత్తమ ముఖ్యమంత్రి'గా గౌరవం అందుకున్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యేగా, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలిగా కొనసాగుతున్నారు.

బీదర్ పోక్సో కేసులో నిందితుడికి యావజ్జీవ శిక్ష

డాక్టర్‌కు ఐదేళ్ల శిక్ష

బెంగళూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): బీదర్ జిల్లాలో పెళ్లి చేసుకుంటానని నమ్మించి బాలికపై నిరంతరంగా అత్యాచారానికి పాల్పడిన మేరకు నమోదైన పోక్సో కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగారశిక్ష విధించారు. జిల్లా సెషన్స్‌కోర్టు సచిన్ కౌశిక్ ధర్మాసనం గురువారం తీర్పును ప్రకటించింది. 2021లో సంతపుర గ్రామంలో సంతోష్‌బసప్ప మేత్ర అనే వ్యక్తి 14ఏళ్ల బాలికపై నిరంతరంగా అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక గర్భం దాల్చడంతో 2022లో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో గర్భస్రావం చేయించారు. డాక్టర్ వైజినాథ బిరాదార్ గర్భస్రావం జరిపించి సాక్ష్యం నాశనం చేశారు. సంతపుర స్త్రీశిశుసంక్షేమశాఖ అధికారి సమగ్ర వివరాలతో 2023 సెప్టెంబరు 2న సంతపుర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు చార్జ్‌షీట్ దాఖలు చేశారు. అందుకు అనుగుణంగా విచారణలు సాగాయి. ఈమేరకు నిందితుడు సంతోష్‌బసప్ప మేత్రకు యావజ్జీవ కారాగారశిక్ష విధించారు. నిందితుడు లక్ష రూపాయలు పరిహారం రూపంలో బాలికకు ఇవ్వాలని తీర్పులో ఆదేశించారు. లేనిపక్షంలో మరో ఏడాది కఠినకారాగారశిక్ష విధించాలని తీర్పునిచ్చారు. కాగా గర్భస్రావం చేసిన డాక్టర్ వైజినాథ బిరాదార్‌కు ఐదేళ్ల కఠినకారాగార శిక్ష విధించారు. రూ.2లక్షల జరిమానా బాధిత బాలికకు ఇవ్వాలని ఆదేశించారు.

రోడ్డు ప్రమాదంలో బాలిక దుర్మరణం

కొత్తచెరువు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి అవ్వాతాతతో కలిసి ఆనందంగా పొలం వద్దకు బయల్దేరిన బాలికను రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. బైక్ నుంచి ఆనందంగా దిగిన చిన్నారి రెప్పపాటులో రక్తసిక్తమవడంతో అవ్వాతాతల గుండెలు పగిలాయి. వారు రోదించిన తీరు అక్కడున్న అందరినీ కంటతడి పెట్టించింది. మండలంలోని బండ్లపల్లి క్రాస్ సమీపంలోని జగనన్న కాలనీ వద్ద పెనుకొండ ప్రధాన రహదారిపై శుక్రవారం బొలెరో వాహనం ఢీకొని బాలిక రిషిక (9) దుర్మరణం చెందింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బండ్లపల్లికి చెందిన వినోద్ గోపాలమిత్రగా పనిచేస్తున్నాడు. అతడికి భార్య నాగవేణి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్న కూతురు రిషిక మూడో తరగతి చదువుతుండేది. వినోద్ శుక్రవారం పొలం వద్దకెళ్లాడు. అవ్వాతాతలతో కలిసి బైక్‌లో రిషిక కూడా బయల్దేరింది. పొలం వద్ద ద్విచక్రవాహనాన్ని ఆపుతుండగానే.. రిషిక దిగేసి పొలంవైపు పరుగు పెట్టింది. ఇంతలోనే పెనుకొండ వైపు నుంచి వేగంగా వచ్చిన బొలెరో వాహనం ఢీకొట్టింది. తలకు తీవ్రమైన గాయమవడంతో బాలిక అక్కడికక్కడే మరణించింది. వాహనం ఆపకుండా వెళ్లిపోయింది. బాలిక అవ్వాతాత అరుపులు విన్న తండ్రి వినోద్ పొలం నుంచి పరుగున వచ్చాడు. విషయం తెలుసుకున్న బంధువులు ప్రమాద స్థలానికి పెద్దసంఖ్యలో చేరుకుని, బోరున విలపించారు. దీంతో వాహన రాకపోకలు స్తంభించాయి. పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని, పరిశీలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకి తరలించారు. ఆపకుండా వెళ్లిపోయిన వాహనాన్ని గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.



విలపిస్తున్న బంధువులు

దొరస్వామికి అభిమానుల అశ్రునివాళులు



లాల్‌బాగ్‌లో నివాళులు అర్పిస్తున్న వాకర్స్ మిత్రబృందం



ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో నివాళులు



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యేలు



డాక్టర్ సీఎన్ మంజునాథ్



ఎంఆర్ సీతారాం



ఆప్తులచే తుది నివాళి

తరికేరి ఎత్తిపోతలకు రూ. 2,611 కోట్లు

బడ్జెట్‌లో ప్రాజెక్టులకు భారీగా నిధులు



బెంగళూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): భద్ర ఎగువ ప్రాజెక్టుకు అనుబంధంగా తరికేరి ఎత్తిపోతల పథకం ద్వారా 49,796 ఎకరాలలో సాగుకు అనుకూలం చేసేందుకు రూ.2,611 కోట్లు బడ్జెట్‌లో కేటాయించారు. చిత్రదుర్గ పరిధిలోని 30 చెరువులకు నీరు మళ్లించదలిచారు. కృష్ణ ఎగువ ప్రాజె క్టు స్టేజ్ 3లో భాగంగా ఆల్మట్టి గేట్‌లను 524.256 మీటర్లకు ఎత్తు పెంచడంతో ముంపు ప్రాంతాలకు పరిహారానికి సానుకూలం తెలిపారు. కళసా బండూరి, మేకెదాటు ప్రాజెక్టులకు కేంద్రం నుంచి అనుమతులు రాగానే నిర్మాణాలు ప్రారంభించదలిచారు. భద్ర ఎగువ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం రెండేళ్లక్రితం ప్రకటించిన 5,300 కోట్లు విడుదల చేయని అంశాన్ని ప్రస్తావించారు. మధుగిరి, కొరటగెరె తాలూకాలలో 107 చెరువులకు నీరు మ ళ్లించేందుకు రూ.553 కోట్లు కేటాయించారు. వృషభావతి వ్యాలిలో 70 చెరువులకు నీరు మళ్ళించేందుకు రూ.1080 కోట్లు, బెంగళూరు తూర్పులో 18 చెరువులకు నీరు నింపేందుకు 93.53 కోట్లు, హెచ్ఎన్ వ్యాలి పరిధిలో 24 చెరువులకు రూ.70 కోట్లు కేటాయించదలిచారు. చిన్ననీటి పారుదల విభాగంలో అభివృద్ధి పనులకు రూ.2వేలకోట్లు కేటాయించారు.

రూ.2500 కోట్లతో 500 పబ్లిక్ స్కూళ్లు

రాష్ట్రబడ్జెట్‌లో విద్యావ్యవస్థకు భారీగా గ్రాంట్లు కేటాయించారు. ఏషియన్ బ్యాంకు సాయంతో 500 పబ్లిక్ స్కూళ్లకు రూ.2,500 కోట్లు, 6రోజులు విద్యార్థులకు కోడిగుడ్డు అందించదలిచారు. సత్యసాయి అన్నపూర్ణ ట్రస్టు ద్వారా రాగి హెల్త్‌మిల్క్‌ను వారంలో ఐదు రోజులు అందించేందుకు రూ.100 కోట్లు కేటాయించదలిచారు. గెస్ట్ లెక్చరర్‌ల గౌరవవేతనం రూ.2వేలు పెంచారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీల గౌరవవేతనాన్ని నెలకు వెయ్యి రూపాయలు అదనం చేశారు. మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా 16347 పాఠశాలల వంటగదుల ఆధునీకరణకు రూ.46కోట్లు, పీయూ కళాశాలలో అదనపు గదులు, మరుగొడ్లకు రూ. 725 కోట్లు, ఫర్నీచర్‌కు రూ.50కోట్లు కేటాయించారు. కల్యాణ కర్ణాటకలో 50 పాఠశాలలను పబ్లిక్‌స్కూళ్లగా మార్చేందుకు రూ.200కోట్లు కేటాయించారు.

బెంగళూరుయూనివర్సిటీకి మన్మోహన్‌సింగ్ పేరు

బెంగళూరు నగర యూనివర్సిటీకి డాక్టర్ మన్మో హన్‌సింగ్ పేరు పెట్టారు. మహిళా కళాశాలల్లో మౌలిక సదుపాయాలకు రూ.26కోట్లు, కొత్త పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ కళాశాలల్లో ఫర్నీచర్, కంప్యూటర్‌లకు రూ.10కోట్లు కేటాయించారు. చింతామణి తాలూకాలోని విశ్వేశ్వరయ్య టెక్నలాజికల్ యూనివర్సిటీకి రూ.150కోట్లు కేటాయించారు.

తల్లీబిడ్డల సంక్షేమానికి రూ.320కోట్లు

తల్లీబిడ్డల మరణాలశాతాన్ని జీరోస్థాయికి త గ్గించేందుకు రూ.320కోట్లు కేటాయించారు. 100 పడకల సామర్థ్యంతో బెంగళూరులో క్రిటికల్‌కేర్ బ్లాక్, 50 పడకల సామర్థ్యంతో రాష్ట్రవ్యాప్తంగా 14 క్రిటికల్‌కేర్ బ్లాక్‌లు ఏర్పాటు చేయదలిచారు. కొత్తగా ప్రకటించిన తాలూకాలకు తాలూకాస్థాయి కమ్యూనిటీ ఆసుపత్రులు, 9 తాలూకాలతోపాటు దావణగెరె, మంగళూరు వెన్‌లాక్ ఆసుపత్రుల ఆధు నీకరణకు రూ.650 కోట్లు కేటాయించారు.

114 మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లు

వైద్యవిద్య విభాగంలో రూ.177 కోట్లతో 114 మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లను, రూ.34కోట్లతో అనస్థీషియా వర్క్‌స్టేషన్‌లను ప్రారంభించదలిచారు. గదగ్‌లో సూపర్‌స్పెషాలిటీ కార్డియాక్‌యూనిట్‌కు రూ.10కోట్లు, కలబురగిలో తల్లీబిడ్డల ఆసుపత్రికి రూ.92 కోట్లు జయదేవ హృద్రోగ ఆ సుపత్రికి రూ.304 కోట్లు, బెంగళూరు నెఫ్రో యూ రాలజీ సంస్థకు రూ.26కోట్లు కేటాయించారు. బౌరింగ్ ఆసుపత్రిలో 500 పడకల ఆసుపత్రి ని ర్మాణానికి రూ.297కోట్లు, మైసూరు, కలబురగిల లో నిమ్హాన్స్ తరహా సంస్థలకు రూ.200 కోట్లు, కొప్పళ, ఆసుపత్రికి రూ.100కోట్లు కేటాయించారు.

గృహలక్ష్మికి రూ.28,608 కోట్లు

గ్యారెంటీ పథకాలలో కీలకమైన గృహలక్ష్మి పథకానికి రూ.28,608 కోట్లు కేటాయించారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు రూ.వెయ్యి, హెల్పర్‌లకు రూ.750 గౌరవ వేతనం పెంచారు. స్త్రీశిశుసంక్షేమశాఖకు వివిధ పథకాల ద్వారా 62,033 కోట్లు కేటాయించదలిచారు. మహిళాభివృద్ధికి రూ.94 వేల కోట్లు సమకూర్చదలిచారు. ఎస్సీ, ఎస్టీ, బుడకట్టు సముదాయ అభివృద్ధికి రూ.42,018 కోట్లు కేటాయించారు. బీసీ సంక్షేమానికి సంబంధించి హాస్టళ్ల అభివృద్ధికి రూ.50కోట్లు, క్రాంతివీరసంగొళ్ళిరాయణ్ణ ప్రాధికార ద్వారా సంగొళ్ళి, ఖానాపురలలో అభివృద్ధికి రూ.28 కోట్లు, ఇంజనీరింగ్, మెడికల్ చదివే బీసీ విద్యార్థులకోసం ప్రత్యేక హాస్టల్ సదుపాయం ఏర్పాటు చేయదలిచారు. బీసీ సంక్షేమానికి అన్ని పథకాలతో కలిపి రూ.422 కోట్లు కేటాయించారు.

మైనారిటీ సంక్షేమం

254 మౌలానా ఆజాద్ ఇంగ్లిష్ స్కూళ్లను పబ్లి క్ స్కూళ్ల తరహాలో పీయూ వరకు అప్‌గ్రేడ్ చేసేందుకు రూ.500కోట్లు కేటాయించదలిచారు. ప్రస్తుత బడ్జెట్‌లో రూ.100కోట్లు, సీఎం మైనారిటీ కాలనీల అభివృద్ధికి రూ.వెయ్యికోట్లు, వక్ఫ్ సంస్థ ల జీర్ణోద్ధరణకు ఆస్తుల సంరక్షణకు రూ.150 కోట్లు, మైనారిటీలకు సంబంధించిన 169 రెసిడెన్షియల్ కళాశాలల్లో చదివే 25వేలమంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణలు ఇవ్వదలిచారు. మైనారిటీలలో సామూహిక వివాహాలు చేసుకునేవారికి రూ.50 వేలు ప్రోత్సాహకాలు ఇవ్వదలిచారు. గురుద్వారాల అభివృద్ధికి రూ.2కోట్లు, బౌద్ధ గ్రంథాలయాల డిజిటలీకరణకు రూ.కోటి, జైన, బౌద్ధ, సిక్కు సముదాయాల అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించనున్నారు.

ఇకపై పది కేజీల బియ్యం

అన్నభాగ్య పథకంలో భాగంగా నగదు బదిలీని రద్దు చేసి 4.21 కోట్లమంది లబ్ధిదారులకు తలా 10 కేజీల బియ్యాన్ని పంపిణీ చేయదలిచారు. రాజీవ్ గాంధీ హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా 12,153 మంది లబ్ధిదారులకు అదనంగా రూ.121కోట్లు కేటాయించారు. రాష్ట్రవ్యాప్తంగా 6-12 తరగతుల బీసీ విద్యార్థుల సంక్షేమానికి రూ.750 కోట్లతో విద్యా ప్రోత్సాహకాన్ని అందించదలిచారు. ఇఎస్ఐ ఆసుపత్రుల అభివృద్ధికి రూ.51కోట్లు కేటాయించదలిచారు. నిరుద్యోగులకు యువనిధి ద్వారా రూ.286 కోట్లు కేటాయించదలిచారు.

రూ.5,200 కోట్లతో రోడ్లకు ప్రగతి

గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్‌శాఖ ద్వారా ప్రగతిపథ పేరిట 5,200 కోట్లతో రోడ్లు నిర్మించదలిచారు. జలజీవన్ మిషన్ పథకం ద్వారా కేంద్రప్రభుత్వ గ్రాంటుకు అనుబంధంగా 6050 కోట్లు విడుదల చేయదలిచారు. కల్యాణ కర్ణాటకలో 38 శాసనసభ నియోజకవర్గాల పరిధిలో వెయ్యికోట్లు కేటాయించారు. కల్యాణ కర్ణాటక అభివృద్ధికి రూ.5 వేల కోట్లు కేటాయించారు. నగరాభివృద్ధిలో మౌలిక సదుపాయాలకు ఏటా 3వేల కోట్లు కేటాయిస్తుండగా బడ్జెట్‌లో 7వేల కోట్లకు పెంచారు. బీబీఎంపీ పరిధిలో 40వేల కోట్లతో ఉత్తర, దక్షిణ, తూర్పు, పడమర సొరంగమార్గం నిర్మించదలిచారు. నమ్మమెట్రో-3 ప్రాజెక్టుకు రూ.8916 కోట్లు, కాలువల బఫర్ ప్రదేశాన్ని అభివృద్ధి చేసేందుకు రూ.3వేల కోట్లు, ఆర్టియల్ రోడ్ల విస్తరణకు రూ. 660 కోట్లు కేటాయించదలిచారు. బ్రాండ్ బెంగళూరుకు గత బడ్జెట్‌లో కేటాయించిన రూ.1800 కోట్లతో 21పనులు అభివృద్ధి చేయదలిచారు.

ప్రజాపనులకు రూ.10వేలకోట్లు

ప్రజాపనుల విభాగంలో 4848 కోట్లతో జిల్లా ప్రధాన రోడ్లు నిర్మించదలిచారు. 29 బ్రిడ్జ్‌ల మరమ్మత్తులకు వెయ్యి కోట్లు, రాయచూరు - సింధనూరు రోడ్డుకు 1696 కోట్లు, దేవనహళ్ళి- విజయపుర నుంచి తమిళనాడు సరిహద్దుకు 123కిలోమీటర్లకు 3190 కోట్లు కేటాయించదలిచారు. గృహజ్యోతి పథకానికి రూ.10,100 కోట్లు కేటాయించదలిచారు.

గ్రాంట్లకోసం ఎమ్మెల్యేల నిరసన

బెంగళూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎమ్మెల్యేలకు తగిన గ్రాంట్లు కేటాయించి అభివృద్ధికి సహకరించాలని ప్రతిపక్షాల ఎమ్మెల్యేలు శుక్రవారం నిరసన తెలిపారు. శుక్రవారం విధానసౌధలోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద ప్లకార్డులతో నిరసన చేశారు. అంబేడ్కర్ మండలి, తాండా అభివృద్ధి మండలి, చర్మ కైగారికా మండలిలుకు కేటాయించిన గ్రాంట్లలో కనీసం సగం కూడా కేటాయించలేదన్నారు. మరోవైపు పలు కార్పొరేషన్లలో అవినీతి చోటు చేసుకున్నాయని అటువంటి వాటికి అడ్డుకట్ట వేసే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష సభ్యులు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల అభివృద్ధిలో తారతమ్యం సరికాదని ఆరోపించారు. నిరసనలో ప్రతిపక్షనేత అశోక్, చలవాది నారాయణస్వామి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, ఎమ్మెల్యేలు సునిల్‌కుమార్, ఎస్ఆర్ విశ్వనాథ్, జేడీఎస్ ఎమ్మెల్సీ శరవణ తదితరులు పాల్గొన్నారు.



విధానసౌధ గాంధీ విగ్రహం వద్ద ఎమ్మెల్యేల నిరసన

ఆంజనేయస్వామి ఆలయ జీర్ణోద్ధరణ



విశేషపూజల్లో మాజీ మంత్రి మునియప్ప

శిడ్లఘట్ట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని తిప్పేనహళ్ళి, తుమ్మనహళ్ళికి చెందిన అభయ ఆంజనేయస్వామి జీర్ణోద్ధరణ, స్వామివారి విగ్రహ పునఃప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయంలో విశేష పూజా కైంకర్యాలు జరిగాయి. మాజీ మంత్రి వీ మునియప్ప, కాంగ్రెస్ నాయకుడు పుట్టు ఆంజినప్ప, కేఎంఎఫ్ డైరెక్టర్ ఆర్ శ్రీనివాస్ విశేషపూజల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు పద్మనాభ నేతృత్వంలో కైంకర్యాలు సాగాయి. పురాతన ఆలయం జీర్ణోద్ధరణకు నోచుకోవడం సంతోషంగా ఉందని పలువురు అభిప్రాయపడ్డారు. ముత్తైదువులకు తుమనహళ్ళికి చెందిన నారాయణస్వామి గాజులు అందచేశారు. ఉత్సవాలకు విచ్చేసిన వేలాది మంది భక్తులకు అన్నసంతర్పణ చేశారు. ఉత్సవంలో జడ్పీ మాజీ అధ్యక్షుడు సుబ్రమణి, భత్తరహళ్ళి మునేగౌడ, తుమ్మనహళ్ళి పంచాయతీ అధ్యక్షురాలు సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీసీ హాస్టళ్లలో వసతులు కల్పించాలి

అసెంబ్లీలో ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి

పుట్టపర్తి రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఉన్న బీసీ సంక్షేమవసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. నియోజకవర్గంలోని బీసీ సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను శుక్రవారం ప్రశ్నోత్తరాల సమ యంలో ఆమె ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాలోని 5 హాస్టళ్లకు ప్రభుత్వ భవనాలు లేవని, 7 హాస్టళ్లకు ప్రహరీలు లేవని, 12 హస్టళ్లలో ఆర్వోవాటర్ ప్లాంట్లు లేవని, మరికొన్నింటిలో మరుగుదొడ్లు, విద్యుత్ సమస్యలు అధికంగా ఉన్నాయన్నారు. వీటికి సంబంధించి తక్షణ చర్యలు తీసుకోవాలని మంత్రి సవితను కోరారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.1.7 కోట్లతో జ్యోతీరావు పూలే బాలకల వసతి గృహం నిర్మాణం చేపట్టారని, రూ.70లక్షలు మాత్రమే విడుదల చేయడంతో నిర్మాణ పనులు ఆగిపోయాయన్నారు. భవన నిర్మాణానికి ప్రస్తుతం రూ. 3కోట్లు అవసరమవుతాయన్నారు. నిధులు కేటాయించి భవనాన్ని పూర్తి చేయాలని మంత్రి సవితను కోరారు. బీసీ సంక్షేశాఖ ఆధ్వర్యంలో శ్రీసత్యసాయి జిల్లా కేంద్రంలో బీసీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇప్పించేందుకు ప్రభుత్వం తరఫున ఏమైనా చర్యలు తీసుకుంటారా అని మంత్రిని ప్రశ్నించారు. అనంతరం జిల్లాలోని మహిళలకు ఎమ్మెల్యే అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.



గోల్డ్ మాల్..!

బెంగళూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): నటి రన్యారావ్ కోట్లాది రూపాయల బంగారం అక్రమ రవాణాకు సంబంధించి డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటిలిజెన్స్ (డీఆర్ఐ) అధికారుల విచారణలో తవ్వేకొద్దీ అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. ఏడాదిలో 27 సార్లు దుబాయ్‌కు వెళ్లినట్లు నిర్ధారణ అయిన సంగతి తెలిసిందే. దుబాయ్‌కు వెళ్లిన ప్రతిసారి రన్యారావ్ ఒకే రకమైన జాకెట్ ధరించేవారని, బంగారాన్ని దాచుకునేందుకు అనుకూలంగా ఉండేదని పోలీసులు నిర్ధారించారు. ప్రతిసారి బంగారాన్ని నడుం, కడుపుభాగంలో చుట్టుకుని వచ్చేవారని, ఎయిర్‌పోర్ట్‌లోని కానిస్టేబుల్ బసవరాజ్ సహకరించినట్లు నిర్ధారణ అయ్యింది. ఈమేరకు బసవరాజ్‌ను డీఆర్ఐ అధికారులు విచారణ జరుపుతున్నారు. భర్త జతిన్ హుక్కేరిని అదుపులోకి తీసుకున్న డీఆర్ఐ విచారణలు జరుపుతున్నారు.

14రోజుల జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న రన్యారావ్‌ను కస్టడీకి తీసుకుని, బెయిల్ పిటిషన్‌కు సంబంధించిన విచారణలు సాగుతున్నాయి. రన్యారావ్‌కు నాలుగునెలలక్రిందటే పెళ్లి అయ్యింది. ఆమె భర్త జతిన్ హుక్కేరి బెంగళూరులో చదివాడు. ఇంటీరియర్ డిజైన్ విభాగంలో ఇంజనీరింగ్ చేసిన జతిన్ ఆ తర్వాత లండన్‌లోని రాయల్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్‌లో డిస్‌రప్టివ్ మార్కెట్ ఇన్నోవేషన్ కోర్సు చేశారు. బెంగళూరుకు వెనుదిరిగి వచ్చాక రెస్టారెంట్ బిజినెస్ ప్రారంభించారు. అతడికి లండన్‌లోనూ రెస్టారెంట్లు ఉన్నాయి. డబ్లుడీఏ అండ్ డీకోడ్, క్రాఫ్ట్‌కోడ్ డీ అనే రెండు కంపెనీలు ప్రారంభించారు. ఆర్కిటెక్చర్, హాస్పిటాలిటీ, ప్లానింగ్ విభాగంలోనూ అనుభవం కల్గిన జతిన్‌హుక్కేరి కస్టమ్స్ రిక్రియేషన్, డిజైన్, ఎంటర్‌టైన్‌మెంట్ విభాగంలోనూ పరిణితి చెందారు. బెంగళూరులో హ్యాంగోవర్ అనే రెస్టారెంట్ ఉంది. ప్రాథమిక సమాచారం మేరకు రన్యారావ్ విచారణలో బంగారం రవాణా విషయాన్ని అంగీకరించినట్లు తెలుస్తోంది. దుబాయ్‌తోపాటు యూరప్, అమెరికా, మధ్యప్రాచ్య దేశాలను సందర్శించినట్లు తెలుస్తోంది.

కుటుంబ నేపథ్యం

రన్యారావ్ నటిగా, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్నారు. తండ్రి కేఎస్ హెగ్డేశ్, ఇంటీరియర్ డిజైనర్, హోటల్ యజమాని జతిన్ హుక్కేరితో కలసి ఉంటున్నారు. పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డీజీపీ రామచంద్రరావు సవతి తండ్రి. రామచంద్రరావు ప్రస్తుతం రెండో భార్యకు మొదటిభర్త ద్వారా ఇద్దరు అమ్మాయిలు కాగా వారిలో ఒకరు రన్యారావ్. రన్యారావ్ దుబాయ్ నుంచి బంగారం రవాణా చేసే విషయంలో ఓ రాజకీయ నేత ప్రమేయం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అతడు ఎటువంటి హోదాలో లేకున్నా ఆయన ద్వారానే అక్రమాలు సాగినట్లు సమాచారం.

మూడు రోజుల కస్టడీకి రన్యారావ్

రన్యారావ్ బంగారు అక్రమ రవాణా వెనుక భారీ కుట్ర ఉందని సమగ్ర విచారణకు డీఆర్ఐ అధికారుల వినతి మేరకు న్యాయమూర్తి విశ్వనాథ శ్రీగౌడర్ మూడు రోజుల కస్టడీకి అనుమతించారు. గురువారం విచారణ జరిపిన న్యాయమూర్తి తీర్పును పెండింగ్‌లో పెట్టారు. శుక్రవారం మూడు రోజుల కస్టడీకి ఆదేశిస్తూ తీర్పునిచ్చారు. కాగా రన్యారావ్ అక్రమ వ్యవహారాలపై హోం మంత్రి పరమేశ్వర్ పోలీసుశాఖ నుంచి ఇంటెలిజెన్స్ నివేదిక కోరారు.

ప్రమాదంలో పెరిగిన మృతులసంఖ్య



బోల్తాపడిన కారు ఇదే...

చింతామణి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): చింతామణి - మురుగమల్ల రోడ్డులోని కాగతి - కొంగతిమ్మనహళ్ళి మధ్య గురువారం మధ్యాహ్నం అదుపు తప్పిన స్కార్పియో కారు బోల్తా పడిన ప్రమాదంలో మృతుల సంఖ్య మూడుకు చేరింది. ప్రమాదంలో బెంగళూరు గుర్రప్పనపాళ్యకు చెందిన డ్రైవింగ్ చేస్తున్న సక్లిన్ (30), తండ్రి వాహిద్ (60)లు ఘటనాస్థలంలోనే మృతి చెందారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సర్దార్ (50)ను చింతామణి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్సలు అందించారు. మెరుగైన చికిత్సకు బెంగళూరుకు తరలించగా చికిత్సలు ఫలించక గురువారం రాత్రి అతను కూడా మృత్యువాత చెందారు. శుక్రవారం బెంగళూరు గ్రామీణ జిల్లా హొసకోటె ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. కాగా ప్రమాదంలో గాయపడిన నగీనా, షోయబ్, అమరీన్‌లు కోలుకుంటున్నారు. అదృష్టవశాత్తు పిల్లలు అసనీమ్ (3), మరియమ్ (2)లు ప్రమాదంనుంచి బయటపడ్డారు. ఒకే కుటుంబానికి చెందినవారు మురుగమల్ల దర్గానుంచి దర్శనం చేసుకుని బెంగళూరుకు వాపసు వెళ్తున్న వేళ బస్సు, బైకును ఓవర్ టేక్ చేసే ప్రయత్నంలో అకస్మాత్తుగా కారు వెనుకటైరు పేలడంతో ప్రమాదం సంభవించింది. ఘటనపై చింతామణి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.62.73 లక్షలు



హుండీ లెక్కిస్తున్న భక్తులు

కదిరి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో హుండీలోని నగదు, కానుకలను శుక్రవారం లెక్కించినట్లు ఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 47 రోజులకుగాను రూ.62,73,741 ఆదాయం వచ్చిందన్నారు. 20 గ్రాముల బంగారం, 340 గ్రాముల వెండితోపాటు, 55 అమెరికన్ డాలర్లు కానుకలుగా వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కెనరా బ్యాంక్ మేనేజర్ అనంతబాబు, బ్యాంక్ సిబ్బంది, సేవాసంస్థ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సదా మీ సేవలో


అచిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతి కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా!



ఈ ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి చెబితే చాలు మా సిబ్బంది తక్షణం మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు. పత్రిక పంపిణీలో మీరు ఏవైనా ఆటంకాలు ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు.

అసిస్టెంట్ సర్క్యులేషన్ మేనేజర్ 95909 81234
ACO బెంగళూరు సౌత్ 77951 55585
SR బెంగళూరు ఈస్ట్ 88616 94202
SR బెంగళూరు నార్త్ వెస్ట్ 99009 22004
SR హొసూరు 86818 81386
ACO - బళ్ళారి 95027 41328

ఇట్లు: జనరల్ మేనేజర్



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1605.25	1,586.02
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	9,909	1212
నీటి నిల్వ (టీఎంసీలు)	29.11	8.01

నిరంతర ప్రయత్నంతోనే ఉద్యోగాలు: కలెక్టర్

బళ్లారి సిటీ, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఉద్యోగార్థులు నిరంతర ప్రయత్నంతో విజయం సాధించవచ్చని, చురుకైన వైఖరి, పోటీతత్వ మనస్తత్వం, నిరంతర కృషి ఉంటే జీవనోపాధికి డోకా ఉండదని జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా అన్నారు. శుక్రవారం నగరంలోని శ్రీమతి సరళాదేవి సతీశ్చంద్ర అగర్వాల్ ప్రభుత్వ ఫస్ట్ గ్రేడ్ (స్వయంప్రతిపత్తి) కళాశాలలో జిల్లాపరిపాలన. జిల్లా పంచాయతీ, నైపుణ్యాభివృద్ధి. వ్యవస్థాపకత, జీవనోపాధిశాఖ, కర్ణాటక నైపుణ్యాభివృద్ధి సంస్థ, బెంగళూరు, జిల్లానైపుణ్య మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో సంజీవిని-కేఎస్ఆర్ఎల్‌పీఎస్, పథకం కింద నిర్వహించిన జిల్లా స్థాయి ఉద్యోగ మేళాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువతరం ఉద్యోగం పొందడమే కాకుండా వ్యాపారాలను స్థాపించడానికి పునాది వేయాలని, మరెందరికో ఉపాధి కల్పించగలరన్నారు.

జిల్లాపంచాయతీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మహ్మద్ హారీస్ సుమైర్ మాట్లాడుతూ.... జీవితంలో విజయం సాధించడానికి కష్టపడి పనిచేయడం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, భాషపై మంచి పట్టు సాధించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ స్కిల్ కనెక్ట్ గురించి విస్తృత ప్రచారం చేపట్టాలని, అవగాహన కల్పించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు ఆదేశించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రాణేశ్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు నైపుణ్య ఆధారిత శిక్షణ అందించడం, ఉద్యోగ మేళాలు నిర్వహించడం ద్వారా ఉద్యోగాలు పొందే అవకాశాలను కల్పించడం ఈ శాఖ లక్ష్యమని అన్నారు. ప్రతి ఉద్యోగ మేళాలో నిరుద్యోగ యువత, యువతులు అధిక సంఖ్యలో పాల్గొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. ఈ ఉద్యోగ మేళలో మొత్తం 48కంపెనీలు పాల్గొన్నాయి. ఈఫెయిర్‌లో మొత్తం 2,749 మంది అభ్యర్థులు నమోదు చేసుకున్నారు. దీనిలో 1,146 మంది ఉద్యోగార్థులు పాల్గొనగా 281మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. 551అభ్యర్థులను రిజర్వ్ చేశారు. ఈసందర్భంగా జిల్లాపంచాయతీ చీఫ్ ఆఫీసర్ వాగీశ్ శివాచార్య, జిల్లా పంచాయతీ ప్లానింగ్ డైరెక్టర్ వినోద్, రాజేంద్ర, కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రహ్లాద్ చౌదరి, జిల్లానైపుణ్యాభివృద్ధి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ విశ్వనాథ్, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ చంద్రమ్మ, జిల్లాప్రచార మేనేజర్ ప్రాణేశ్ పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా


కోళ్లఫామ్‌లను పరిశీలిస్తున్న డీహెచ్ డాక్టర్ యల్లా రమేష్

బర్డ్‌ఫ్లూ అంటే భయం వద్దు: డీహెచ్ఓ

బళ్లారి గాంధీనగర్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): బర్డ్‌ఫ్లూతో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అయితే ఎక్కడైనా మృతిచెందిన కోళ్ళు, పక్షులు కనిపిస్తే వాటిని ముట్టుకోకుండా జాగ్రత్తగా ఉండాలని డీహెచ్ఓ డాక్టర్ యల్లా రమేష్ బాబు తెలిపారు. గురువారం బళ్ళారి తాలూకా కప్పగల్లు గ్రామంలో బర్డ్‌ఫ్లూతో వేలాది కోళ్ళు మృతి చెందిన విషయమేనని, అయితే వాటిని ఇప్పటికే గ్రామానికి ఒక కిలోమీటరు దూరంలో పాతిపెట్టినట్లు తెలిపారు. శుక్రవారం కప్పగల్లు గ్రామంలో సందర్శించిన ఆయన బర్డ్‌ఫ్లూ వ్యాధి సోకిన కోళ్ళఫారమ్‌లను పరిశీలించారు. చుట్టుపక్కల బ్లీచింగ్ పౌడర్ చల్లించి వ్యాధి విస్తరించకుండా చూడాలని ఆదేశించారు. వ్యాధి సోకితే కొంతమేర ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తుతాయని, అయినా పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. బర్డ్‌ఫ్లూ కేసులు నమోదైన నేపథ్యంలో జిల్లాలో ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బంది ఇంటింటికీ వెళ్ళి ప్రజలను జాగృతి చేస్తున్నట్లు, తమతమ పరిధిలో ఎక్కడైనా ఆకస్మికంగా కోళ్ళు గాని పక్షులుగాని మృతి చెందినట్లు కనిపిస్తే వాటిని ఎటువంటి పరిస్థితిలోనైనా సరే ముట్టుకోరాదని హెచ్చరించారు. గ్రామం ప్రజల్లోగాని, ఇతర ప్రాంతాల నుండి వచ్చిన వారిలో దగ్గు, తీవ్రమైన జ్వరం, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది, ముక్కు కారడం, తలనొప్పి, గొంతునొప్పిలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళి అవసరమైన చికిత్స చేయించుకోవాలని సూచించారు. పిల్లలను పక్షులు, కోళ్ళవద్దకు వెళ్ళకుండా చూడాలని హెచ్చరించారు. ఈ సందర్భంగా జిల్లా ఆరోగ్య శిక్షణాధికారి ఈశ్వర్ హెచ్.దానప్పవర్, ఆరోగ్య నిరీక్షకులు మహీంద్ర సింగ్, ఆశా కార్యకర్తలు పద్మావతి, ఈరమ్మ, గ్రామస్థులు పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

బళ్లారి సిటీ, మార్చి 7(ఆంధ్రజ్యోతి): జాతీయ న్యాయసేవల అథారిటీ, రాష్ట్ర న్యాయసేవల అథారిటీ ఆదేశాల మేరకు శనివారం జిల్లాన్యాయసేవల అథారిటీ నగరంలోని తాళూరు రోడ్డు కొత్త జిల్లా కోర్టు సముదాయంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తుందని జిల్లాన్యాయ సేవల అథారిటీ ఛైర్మన్ కేజీ శాంతి తెలిపారు. బళ్లారి, విజయనగరం జిల్లాల్లోని మొత్తం 31కోర్టుల్లో జరగనున్న మెగా- లోక్ అదాలత్ ద్వారా ప్రజలు తమ ప్రీ-లిటిగేషన్, రాజీ క్రిమినల్ కేసులు, బ్యాంకు కేసులు, మోటారు వాహన ప్రమాద పరిహార ట్రిబ్యునల్ కేసులు, వైవాహిక, కుటుంబ కేసులు, సివిల్ కేసులు, రాజీ కేసులను త్వరగా పరిష్కరించుకుని ఉపశమనం పొందాలనున్నారు. బాధితులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విదేశీ పర్యాటకులపై దాడి


దాడికి గురైన విదేశీ మహిళను విచారిస్తున్న పోలీస్

గంగావతి రూరల్, మార్చి7(ఆంధ్రజ్యోతి): విదేశీ పర్యాటకులపై దాడి చేయడం స్థానికంగా కలకలం రేపింది. గురువారం రాత్రి తుంగభద్రనది ఒడ్డున గిటార్ వాయిస్తూ కూర్చున్న ఇద్దరు విదేశీ, ముగ్గురు దేశీయ పర్యాటకులు దాడికి గురయ్యారు. తాలూకా కేంద్రానకి సమీపాన ఉన్న సనపూర్ సరస్సు సమీపంలో ఈ ఘటన జరిగింది. అమెరికా, ఇజ్రాయిల్ నుంచి ఒక్కొక్కరు, గంగావతి తాలూకా ఆనేగొంది లోని హార్ట్‌లైన్ హోమ్‌స్టే యజమాని అంబికా పరమేశ్‌నాయక్, నాసిక్‌కు చెందిన పంకజ్ పటేల్, ఒడిశాకు చెందిన బిబాస్‌లపై దాడి జరిగింది. పర్యాటకులు అక్కడ గిటార్ వాయిస్తూ కూర్చుండగా బైక్‌పై వచ్చిన ముగ్గురు దుండగులు గొడవకు దిగారు. అది గొడవకు దారితీసింది. వివాదాపిరి కారణాలపై పోలీసులు విచారణ చేపట్టారు. వారిలో నలుగురిని చికిత్స కోసం గంగావతిసబ్ డివిజన్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. దాడికి గురైన ఒడిశాకు చెందిన పర్యాటకుడి ఆచూకీ తెలియరాలేదు. శుక్రవారం నగర పోలీస్ ఇన్‌స్పెక్టర్ ప్రకాశ్ మాలే, డాగ్‌స్క్వాడ్ సంఘటనా స్థలానికి చేరుకుని తనిఖీలు నిర్వహించారు. సంఘటనా స్థలంలో ఓ ద్విచక్రవాహనం, ఓ హ్యాండ్‌బ్యాగ్ దొరికాయి. హ్యాండ్‌బ్యాగ్‌లో కెమెరా, పవర్‌బ్యాంక్, పెన్ను, విరిగిన గిటార్, గ్లాజులు, సిగరెట్లు, రక్తపు మరకలున్న బట్టలు దొరికాయని పోలీసు వర్గాలు తెలిపాయి.

టమోటా కిలో రూ.8

అనంతపురం రూరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.8తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు శుక్రవారం 225 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.7, కనిష్ఠ ధర రూ.5 పలికినట్లు ఆయన తెలిపారు.

కామెర్లను ప్రారంభ దశలోనే గుర్తించాలి

● జాగ్రత్తలతో సురక్షితం: పీడీ డాక్టర్ షకీలా


జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న షకీలా

బళ్లారి సిటీ,మార్చి 7(ఆంధ్రజ్యోతి): కామెర్లను ప్రారంభదశలోనే గుర్తించి చికిత్స పొందితే ఎటువంటి ప్రమాదం లేదని హెపటైటీస్ కంట్రోల్ ప్రోగ్రామ్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ షకీలా అన్నారు. శుక్రవారం హెపటైటీస్-బీ నివారణ దినం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బళ్లారి నగరంలో నిర్వహించిన రెండు రోజుల కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. హెపటైటీస్ -బీ అనేది కాలేయాన్ని ప్రభావితం చేసే వైరల్ ఇన్ఫెక్షన్ అని, మూత్రం రంగుమారడం, వికారం మొదలైన లక్షణాలు కనిపిస్తే, వీలైనంత త్వరగా చికిత్స పొందాలన్నారు. ఈదశలో కూడా నిర్లక్ష్యం చేస్తే రోగి ఆర్యోం తీవ్రమైన పరిస్థితివకి మారవచ్చని, దీనికోసం అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని , 2030 నాటికి దేశాన్ని హెపటైటీస్ రహితంగా మార్చడానికి ప్రతి ఒక్కరూ చేతులు కలిపి తమ కర్తవ్యాన్ని నెరవేర్చాలన్నారు. డీహెచ్ఓ రమేష్ బాబు మాట్లాడుతూ కామెర్లు ప్రాణాంతకం కాదని, ఆందోళన అవసరం లేదన్నారు. గర్భిణులు జాగ్రత్తగా ఉండాలన్నారు. చిన్నారులకు టీకాలు వేయించాలన్నారు. బిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బి.గంగాధర్‌గౌడ, జిల్లాసర్జన్ డాక్టర్ బసారెడ్డి, డాక్టర్ హర్షిత, జిల్లా ఆరోగ్య విద్య అధికారి ఈశ్వర్ దాసప్ప, డీపీసీ అర్చన, డా.గిరీష్, అనిల్‌కుమార్, హెల్త్ ఇన్‌స్పెక్టర్ పంపాపతి, అధికారులు పాల్గొన్నారు.

జొన్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

సిరుగుప్ప, మార్చి 7(ఆంధ్రజ్యోతి): బళ్లారి కలెక్టర్ ప్రశాంత్‌కుమార్‌మిశ్రా హాళేకోట జొన్నల కేంద్రాన్ని సందర్శించారు. రైతుల నుంచి జొన్నలను ప్రభుత్వ నియమానుసారం తీసుకోవాలని ఆయన సూచించారు. రైతులకు ఖాళీ బస్తా సంచులను ఇవ్వాలని ఆయన చెప్పారు. అనంతరం హాళేకోట ప్రభుత్వ భూములను పరిశీలించారు. సిరుగుప్ప పట్టణంలో డ్రైవర్ కాలనీలకు సందర్శించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విశ్వనాథ్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్ భేష్: యూత్ కాంగ్రెస్


రియాజ్ అహ్మద్

కంప్లి, మార్చి 7(ఆంధ్రజ్యోతి) : ఈసారి రాష్ట్ర బడ్జెట్ ప్రజానుకూలంగా ఉందని, పేదలు, కష్టజీవులకు సీఎం అనుకూల బడ్జెట్ ప్రవేశపెట్టారని యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు రియాజ్ అన్నారు. పేదలు, కష్టపడి పనిచేసే ప్రజలకు అనుకూలంగా, సర్వతోముఖాభివృద్ధికి కేటాయించడం హర్షణీయమని ఆయన శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజానుకూల బడ్జెట్‌ను సమర్పిస్తూ శ్రీ సిద్దరామయ్య ప్రతిరంగానికి ప్రాధాన్యతనిస్తూ ప్రాజక్టులు, నిధులు కేటాయించారు.

మృత్యుకుంట..!

చింతామణి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): నీటి కుంటు ముగ్గురిని బలిగొనింది. తాలూకాలోని ముంతకదిరేనహళ్ళి సమీపాన అబ్బుగుండు ప్రసాద్‌కు చెందిన వ్యవసాయ నీటి కుంటలోకి దిగిన ముగ్గురు విద్యుద్ఘాతంతో మృత్యువాత పడిన సంఘటన శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. లోకేశ్ (31), రమేశ్ (28), శ్రీకాంత్ (25) మృతి చెందిన వారు. లోకేష్ కుంటలో నున్న మోటార్ రిపేరు రావడంతో మరమ్మత్తుకోసం నీటిలోనికి దిగారు. మరమ్మతు చేస్తుండగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యింది. విద్యుత్ సరఫరా కావడంతో విలవిలలాడుతుండగా ఒకరి తర్వాత మరొకరు కాపాడబోయి ముగ్గురూ బలయ్యారు. లోకేశ్‌కు వివాహమై ఒక ఏడాది బిడ్డ ఉంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను వెలికితీశారు. చింతామణి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.


శ్రీకాంత్(ఫైల్) లోకేశ్(ఫైల్) రమేశ్(ఫైల్)

డివైడర్‌ను ఢీ కొని లారీ బోల్తా

సిరుగుప్ప, మార్చి 7(ఆంధ్రజ్యోతి) : భారీ లోడు గల లారీ డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. ఈ సంఘటనలో వృద్ధురాలు సన్నఈరమ్మ తీవ్రంగా గాయపడిన సంఘటన సిరుగుప్ప పట్టణం ఆదోని రోడ్డు మార్గంలో నాగలింగేశ్వర ఆలయం వద్ద హైవేదారిలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. బాగల్‌కోట జిల్లాకు చెందిన లారీ సిరుగుప్ప పట్టణంలో రైస్ మిల్లు నుంచి భారీ లోడుతో సింధనూరు వైపు వెళుతున్నప్పుడు అతివేగంగారావడంతో డివైడర్‌ను చూసుకోకుండా దూసుకెళ్లడంతో లారీ బోల్తాపడింది. లారీ బోల్తా పడినసమయంలో అక్కడ వృద్ధురాలు వెళుతుండగా ఆమెను ఢీకొట్టడంతో పాటు రెండు ద్విచక్రవాహనాలను ఢీకొంది. దీంతో బైకులు నుజ్జునుజ్జయ్యాయి. స్థానికులు బస్తాలను వెలికి తీసి పోలీసు యంత్రాంగం క్రేన్‌ల ద్వారా లారీను యథాస్థితికి తీసుకువచ్చారు. గాయపడ్డ వృద్ధురానికి చికిత్స కోసం బళ్లారికి తరలించారు. సీఐ హనుమంతప్ప, ఎస్ఐ పరశురామ్, అగ్నిమాపక అధికారులు, పోలీసులు సంఘటనాస్థలాన్ని సందర్శించారు. అక్కడ పరిస్థితిని అందుపులోకి తీసుకువచ్చారు. లారీని బైకులను పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

కరిబసవ రాజేంద్రస్వాములకు తులాభారం


తులాభారంలో పాల్గొన్న భక్తులు

బళ్లారి సిటీ, మార్చి 7(ఆంధ్రజ్యోతి): సండూరు తాలూకా కురేకుప్ప జగద్గురు రేణుకాచార్య ఆశ్రమంలో ఏర్పాటు చేసిన శివశరణి హేమారెడ్డి మల్లమ్మ పురాణ ప్రవచన కార్యక్రమంలో ఉరవకొండ గవిమఠం ఉత్తరాధికారి కరిబసవరాజేంద్రస్వాములకు తులాభార కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మిగనూరు హంపిసాగర దేవర మఠం వామదేవ శివాచార్య స్వామి, వెంకటాపుర పరతత్వానంద అవధూత ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరశైవ విద్యావర్ధక సంఘం మాజీ అధ్యక్షుడు ఉడేద బసవరాజ్, సిద్దరామేశ్వరగౌడ కరూరు, వకీల్ నరేంద్రబాబు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు భోగనగౌడ, సీనియర్ శశిధర్‌మేటిని సన్మానించారు. ఈసందర్భంగా బసవరాజ జోళదరాశి, ధర్మకర్త శరణబసయ్యస్వామి, వీఎస్ఆర్ లాకాలేజ్ పాలక మండలి అధ్యక్షుడు నరేంద్రబాబు,వకీల్ వీరప్పవ, జడేశ్,నీలనగౌడ, రుద్రగౌడ, వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

గ్రామీణ మహిళలకు చేయూత

● పలు రంగాల్లో ఉచిత శిక్షణతో ఉపాధి
● మాతృ మహిళా మండలి సేవలకు ప్రశంసలు


కుట్టు శిక్షణ పొందిన మహిళలతో పుష్పచంద్రశేఖర్

బళ్లారి రూరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని మహిళలకు పలు రంగాల్లో ఉచిత శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి కల్పిస్తూ మాతృమండలి సంస్థ పలువురి ప్రశంసలు అందుకుంటుంది. మహిళా దినోత్సవం సందర్భంగా అధ్యక్షురాలు కే పుష్ప చంద్రశేఖర్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలని తమ సంస్థ పది సంవత్సరాలుగా మహిళలకు కుట్టుమిషన్, ఫ్యాషన్ డిజైనింగ్ బ్యూటీ పార్లర్, ఉచిత కంప్యూటర్ చీర కుచ్చిళ్ల, కాటన్ పేపర్ బ్యాగుల తయారీ అగరబత్తి క్యాండిల్, తయారీలో శిక్షణ ఇస్తున్నామన్నారు. ఆరోగ్య శిబిరాలు దాంతో పాటు పిల్లలకు యోగా శ్లోక హిందూ సాంప్రదాయాలను చెట్లు సంరక్షణపై పిల్లలకి అవగాహన మొక్కలు నాటే కార్యక్రమాలు మరెన్నో మాతృ మహిళా మండలి సంఘం ఆధ్వర్యంలో ఎన్నో సేవలు చేసి ఎందరో మహిళలకు ఉచిత శిక్షణలందించి దాదాపుగా 15 నుంచి 1700 మంది మహిళలకు ఉపాధి కల్పించామన్నారు. నగరంలోని మోకా రోడ్డులో ఉన్న హోటల్ నక్షత్ర ఎల్ఆర్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవలందించిన వారికి అవార్డు అందిస్తామన్నారు.

పట్టణాభివృద్ధికి సహకరించండి

● బడ్జెట్ సమావేశంలో కాంగ్రెస్ నాయకుడు రాజశేఖర్


పంచాయతీ అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కనికేరి పంపాపతి

కంప్లి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): కుడితిని పట్టణ అభివృద్ధికి కౌన్సిలర్లు సభ్యులు, సహకరించాలని స్థాయి సమితి అధ్యక్షుడు రాజశేఖర్ కోరారు. శుక్రవారం వార్షిక సమావేశంలో ఆయన మాట్లాడారు. అధ్యక్షులు బసమ్మ, చంద్రప్ప అధ్యక్షతన ఈ బడ్జెట్ సమావేశం జరిగింది. అనంతరం రాజశేఖర్ మాట్లాడుతూ.. 8.13 లక్షల పొదుపు బడ్జెట్‌ను సమర్పించారు. కొత్త భవన నిర్మాణానికి పీఏపీ సొంత నిధుల నుంచి సుమారు రూ. ఐదు కోట్లు రిజర్వ్ చేసిందని, డీపీఆర్ తయారు చేసి ప్రభుత్వానికి ప్రతిపాదిస్తామన్నారు. దహన సంస్కారాలకు విద్యుత్ స్మశానవాటిక ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకున్నారు. మొదటి దశలో రాజీవ్ గాంధీ గృహ నిర్మాణ పథకం కింద 600 ఇళ్లు నిర్మిస్తామన్నారు. రెండోదశలో మిగిలిన ఇళ్లను నిర్మించనున్నారు. రూ. 50 లక్షలతో హంపి తరమాలో కుడితిని గేటు నిర్మించేందుకు సన్నాహాలు చేశారు. ఆలమట్టి రిజర్వాయర్ నుంచి కేపీసీఎల్ చెరువుకు వచ్చేనీటిని కుడితిని పాత చెరువుకు సరఫరా చేసేందుకు పైపులైన్, మోటార్లు ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధ్యక్షుడు కనికేరి పంపాపతి మాట్లాడుతూ వార్డులో కనీస వసతులు లేవని అభివృద్ధి కుంటుపడిందన్నారు. పట్టణ అభివృద్ధికి సంబంధించి సౌకర్యాలు కల్పించాలని ఎన్నిసార్లు ముఖ్య అధికారి తీర్థప్రసాద్‌కు చెప్పినాపట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సభ్యులు జీఎస్ వెంకటరమణ, హేలప్ప, సునీల్ కుమార్, మంజునాథ, రామలింగప్ప, లెనిన్, దేవమ్మ, రత్నమ్మ, సాలమ్మ పాల్గొన్నారు.

హోసూరు జోన్

బాలికకు బలవంతపు వివాహం.. ఇద్దరి అరెస్టు

హోసూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): హోసూరు అంచెట్టి సమీపాన ఓ గ్రామానికి చెందిన 14 ఏళ్ల బాలికకు ఈనెల 3న బెంగళూరులో బలవంతంగా పెళ్లి చేశారు. బాలికను పెళ్లి చేసుకున్న వ్యక్తి, బాలిక తల్లి, ఇతరులు బలవంతంగా ఇంటి నుంచి తీసుకెళ్లారు. బాలిక ఏడవడంతో చుట్టుపక్కలవారు గమనించి ఫొటోలు తీయగా సోషల్ మీడియాలో వైరల్ అయింది. డెంకణీకోటలోని మహిళా పోలీసు విభాగం ఈ విషయమై ప్రత్యేకంగా విచారణ చేపట్టింది. బలవంతపు పెళ్లికి సహకరించిన బాలిక తల్లి, పెళ్లి చేసుకున్న మాదేశ్, మల్లేశ్ అనే వ్యక్తిని శుక్రవారం అరెస్ట్ చేశారు. కాగా మల్లేశ్ భార్య మునియమ్మాళ్, వారి బంధువు మునియప్పను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

రహదారి పనుల తనిఖీ

హోసూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): హోసూరు పరిసర ప్రాంతాల్లో వివిధ రహదారి పనులు కొనసాగుతున్నాయి. సేలంలోని హైవేస్ విభాగం నిర్మాణ, నిర్వహణ పర్యవేక్షక ఇంజనీర్ శశికుమార్ నేతృత్వంలో పూర్తయిన పనులను పరిశీలించారు. తమిళనాడు హైవేస్ డిపార్ట్‌మెంట్ నిర్మాణం, నిర్వహణ కృష్ణగిరి డివిజన్ అధికారులు హోసూరు-డెంకణీకోట రోడ్డు, అత్తిముగం, పేరండపల్లి, తొరపల్లి, నల్లూరు, కగ్గనూరురోడ్డు మార్గం సేవగానపల్లి రోడ్డు మాలూరు, హోసూరు - అదియమాన్ కోట్టై రోడ్డు, నందిమంగలం రోడ్డు, బాగలూరు, డివిజన్ క్రింద కృష్ణగిరి డివిజన్ శూలగిరి-ఉద్దనపల్లి రహదారిలో పూర్తయిన పనులను హైవేస్ విభాగం సేలం నిర్మాణ, నిర్వహణ సూపరింటెండెంట్ ఇంజనీర్ శశికుమార్ పరిశీలించారు. సర్వేలో కృష్ణగిరి లైన్ ఇంజనీర్ తిరుల్లోకసుందర్, అసిస్టెంట్ లైన్ ఇంజనీర్ హోసూరు మురుగన్, అసిస్టెంట్ ఇంజనీర్ రాజ్‌కుమార్, సర్వేయర్లు పాల్గొన్నారు.


రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

బొలెరో-ఆర్టీసీ బస్సు ఢీ.. డ్రైవర్ మృతి

రాయచూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సింధనూరు తాలూకా పగడదిన్ని సమీపంలో శుక్రవారం బొలెరో, ప్రభుత్వ ఆర్టీసీ బస్సు మధ్య ప్రమాదం జరిగి బొలెరో వాహనం డ్రైవర్ మృతి చెందాడు. మృతుడు మంజునాథ్(21)గా గుర్తించారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం, బితిమీరిన వేగం వల్లే ప్రమాదం సంభవించిందని, బస్సులో ఉన్న ఏడెనిమిది మంది ప్రయాణికులు గాయపడగా, బొలెరో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనకు సంబంధించి సింధనూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.


ధ్వంసమైన బస్సు, మంజునాథ్ (ఫైల్)

జీఎస్టీ చెల్లింపులపై అవగాహన


మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ పాండ్యరాజ్

హోసూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): హోసూరు జోన్ 1, 2 సెంట్రల్ గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ డివిజన్, హోసూరు స్మాల్ అండ్ మైక్రో ఎంటర్‌ప్రైజస్ అసోసియేషన్ శుక్రవారం హొస్టియా కార్యాలయంలో పన్ను చెల్లింపుదారుల ప్రయోజనం కోసం సెంట్రల్ గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ యాక్ట్, 2017 సెక్షన్ 12 అండ్ ఏ ప్రకారం జీఎస్టీ వడ్డీ, జరిమానా మినహాయింపు పథకం 2024పై అవగాహనా ప్రచారాన్ని నిర్వహించారు. హోసూరు 2 సెంట్రల్ గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ డివిజన్ డిప్యూటీ కమిషనర్ పాండ్యరాజ్ సెక్షన్ 12 అండ్ ఏ క్రింద వడ్డీ, పెనాల్టీ మాఫీ, సెక్షన్ 16(5), 16(6) ప్రకారం ఐటీ రాయితీకి సంబంధించిన నిబంధనలు వివరంగా వివరించారు. పథకం యొక్క ప్రాముఖ్యతను, వాటిని పొందే విధానాలను ఆయన వివరించారు. పన్ను చెల్లింపుదారులు కేవలం పన్ను మాత్రమే చెల్లించి, సెక్షన్ 73 ప్రకారం నోటీసులు మరియు ఉత్తర్వులపై వడ్డీ, జరిమానా నుంచి మినహాయింపు పొందడం ద్వారా వ్యాజ్యాన్ని తగ్గించుకోవడానికి ఈ పథకం సహాయపడుతుందని ఆయన తెలిపారు. పన్ను చెల్లింపుదారులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని హోసూరు 1 సెంట్రల్ గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ రాజేశ్ కోరారు. హొస్టియా అడ్మినిస్ట్రేటర్లు వడివేలు, సుధాకర్, రీజియన్, 3 ఈ ప్రాజెక్టును పొందేందుకు వారి చెల్లింపుదారులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు పన్ను చెల్లింపుదారులు, పన్ను నిపుణులు, వాణిజ్య సంస్థల సభ్యులు, హొస్టియా సభ్యులు పాల్గొన్నారు. ఈ పథకంలో పన్ను చెల్లించడానికి చివరి తేది మార్చి 31గా ఉందని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కలెక్టరేట్‌కు నూతన వాహనాలు

హోసూరు(కృష్ణగిరి) మార్చి 7(ఆంధ్రజ్యోతి): చెన్నైలో జరిగిన కార్యక్రమంలో రెవెన్యూ శాఖ తరఫున కృష్ణగిరి జిల్లా ఊతంగరై, పోచ్చంపల్లి జిల్లా కలెక్టర్ల వినియోగానికి కొత్త వాహనాలను అందించారు. కృష్ణగిరి జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎస్.దినేశ్‌కుమార్ నూతన వాహనానికి తాళం చెవిని అందజేశారు. వారు దానిని శుక్రవారం పోచ్చంపల్లి జిల్లా కమిషనర్‌కు అందించారు. జిల్లా కలెక్టర్ ఇంటర్వ్యూ అసిస్టెంట్ కుమరన్‌తోపాటు తదితర అధికారులు పాల్గొన్నారు.


వాహనం అప్పగిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్